# చంచల్‌గూడా జైలుకు అఘోరీ శ్రీనివాస్

హైదరాబాద్,ఏప్రిల్24: అఘోరీ శ్రీనివాస్‌ను మహిళా జైలుకు తరలించారు. ఉమెన్ ట్రాన్స్ జెండర్ కావడంతో చంచల్ గూడ మహిళా జైలుకు పోలీసులు తరలించారు. యూపీలో అరెస్ట్ చేసిన అఘోరని బుదశారం హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. అఘోరీ ప్రస్తుతం చంచల్ గూడ మహిళా జైలులో ఉన్నారు. మరో వైపు వర్షిణిని భరోసా సెంటర్‌కు తరలించినట్లు సమాచారం. రిమాండ్ నేపథ్యంలో అఘోరి శ్రీనివాస్‌ను ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిన పోలీసులు, అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఆయనను ట్రాన్స్ జెండర్ ఫీమేల్‌గా గుర్తించారు. దాంతో కంది సబ్ జైలు అధికారులు జైలులోకి ప్రవేశానికి నిరాకరించారు. దానితో పోలీసులు శ్రీనివాస్‌ను మరోసారి వైద్య పరీక్షల కోసం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య నివేదిక ఆధారంగా ఆయనను ఏ జైలుకు తరలించాలన్న దానిపై అధికారులు నిర్ణయం తీసుకున్నారు. చంచల్ గూడ మహిళా జైలుకు తరలించారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :54 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 25-04-2025 | పేజీలు:4 వెల: 2.00


# బిఆర్ఎస్ ధరణితో రైతులకు తీవ్ర నష్టం



సిద్దిపేట,ఏప్రిల్24: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ ద్వారా చాలా మంది రైతులకు నష్టం జరిగిందని.. అలాంటి తప్పులు మళ్లీ జరగొద్దనే రైతులకు సులభంగా అర్థమయ్యే రీతిలో భూ భారతి తీసుకొచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగానే భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. గురువారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి అంటేనే ఆత్మగౌరవం. అలాంటి భూమి వివాదాల్లో ఉండకుండా సమస్యల పరిష్కారం కోసం భూ భారతి చట్టం తీసుకొచ్చామని, రైతులకు భూ భారతి ఎంతగానో ఉపయోగ పడుతోందన్నారు. ధరణిలో 30 లక్షల మంది భూ సమస్య ఉందని పిటిషన్ పెట్టుకున్నారు. ఆ సమస్యలు భూ భారతి ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. త్వరలోనే గౌరవెల్లి కాలువల నిర్మాణం పూర్తవుతుందని.. ప్రాజెక్ట్ ద్వారా నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ భూ సేకరణ సమయంలో కొంత మంది రైతులకు నష్టం జరిగిన వారిని ఆదుకుంటామని భరోసా కల్పించారు. భూ భారతి చట్టాన్ని అందరి ఆమోదంతోనే అమలు చేశామని మంత్రి అన్నారు. కొంతమంది వీఆర్వోలు కేసీఆర్ చెప్పిన పనులు చేయలేదని అర్ధరాత్రికి రాత్రి వీఆర్వో వ్యవస్థను రద్దు చేశారన్నారు. త్వరలో రెవిన్యూ వ్యవస్థలో జీపీఏ వ్యవస్థను తీసుకొస్తామని అన్నారు. కొత్త చట్టం తీసుకొస్తే ప్రజలకు ఉపయోగపడాలి కాని భారంగా మారకూడదన్నారు. గత ప్రభుత్వంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూములను.. అక్రమ పట్టాలను రద్దు చేస్తామన్నారు. భూభారతిపై రైతులు అవగాహన కల్పించేందుకే అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని.. భూభారతి చట్టంలో తహశీల్దార్ నుంచి సీసీఎల్ఏ స్థాయి వరకు సమస్యలు పరిష్కరించేందుకు వెసులుబాటు కల్పిస్తామన్నారు. భూమి రిజిస్ట్రేషన్ కు ముందు తప్పనిసరిగా భూ సర్వే చేసి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుదని.. భూభారతి పోర్టల్ లో అన్ని సమస్యలకు స్వయంగా దరఖాస్తు చేసుకునేలా రూపొందించారు. భూభారతి పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలను పరిష్కరిస్తామని.., అధికారులనే క్షేత్రస్థాయికి పంపిస్తున్నామన్నారు. నెలాఖరులోగా నాలుగు మండలాల్లో అన్ని వివరాలు సేకరించి, జూన్ 2న పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నా రు. మే1వ తేదీ నుంచి మరో 28 జిల్లాల్లో ఒక్కో మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకుని భూభారతిని అమలు చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఏమైనా సూచనలు వస్తే నియమనిబంధనల్లో మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. గత ప్రభుత్వం అనాలోచనతో 2020 ధరణి చట్టాన్ని తీసుకొచ్చి... ప్రజలకు అనేక ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ధరణి చట్టాన్ని తీసుకొచ్చిన మూడేళ్ల వరకు నియమ నిబంధనలు రూపొందించలేదని... విధివిధానాలు స్పష్టంగా తెలియజేయలేదని.. కేసీఆర్ నోట ఏది వస్తే ఆ మాట ప్రకారమే నడుచుకుందన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందుల నుంచి విముక్తి చేసేందుకు ఇందిరమ్మ రాజ్యంలో 2025లో భూభారతి చట్టాన్ని తెచ్చామన్నారు. అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పులు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సాదాబైనామాల కింద ఆన్‌లైన్‌లో ఉన్నటు-వంటి అర్హత గల దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు.

# పదేళ్ల బిఆర్ఎస్ పాలన స్వర్ణయుగం

హైదరాబాద్,ఏప్రిల్24: తన పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేసీఆర్ ఉద్యమ నినాదాలను నిజం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలలను కూడా సాకారం చేశారని చెప్పారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేటీఆర్.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన పల్లె ప్రగతిని గుర్తుచేస్తూ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఆ పోస్టులో కేటీఆర్.. 'పదేళ్ల పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమేగాక గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్ముడు కన్న కలలను కూడా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారు. ఇవాళ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటు-న్న వేళ.. పల్లెసీమలే దేశానికి పట్టు-గొమ్మలన్న మహాత్మా గాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణం పోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. సమైక్య పాలనలో దశాబ్దాలపాటు- దగాపడ్డ పల్లెలను దర్జాగా కాలర్ ఎగరేసుకునే స్థాయికి తీర్చిదిద్దిన సందర్భాలు అపూర్వం. అనితర సాధ్యం.' అని పేర్కొన్నారు. సమస్యల సుడిగుండంలో విలవిలలాడిన ప్రతి పల్లె నాడు సకల సౌకర్యాల హరివి÷-లలైంది. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారింది. ప్రతి పల్లెలో డంప్ యార్డు తప్ప.. చెత్త కంపు లేని స్థితి వచ్చింది. కూలిపోయే స్థితి ఉన్న ఖాళీ ఇండ్ల కిరికిరి నుంచి పొంగిపొర్లే మురికి కాలువల శుభ్రత వరకూ ప్రతి సమస్యకు పదేళ్ల పాలనలో శాశ్వత పరిష్కారం దొరికింది. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతలేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామ స్వరాజ్యంలో ఓ స్వర్ణయుగం.' అని కేటీఆర్ రాసుకొచ్చారు. పచ్చదనానికి కొదవ లేకుండా, నిధులకు కొరత లేకుండా, విధులకు ఆటంకం లేకుండా, ప్రతి ఊరును మెరుగైన జీవనానికి మారుపేరుగా మార్చింది కేసీఆర్ విజనే. దేశంలో 3 శాతం జనాభా



ఉన్న తెలంగాణ, పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయం. నాడు పదేళ్లపాటు- మురిసిన పల్లె, కాంగ్రెస్ పాలనలో నేడు మళ్లీ కన్నీరు పెడుతోంది. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పింది. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవు. గ్రామాల్లో కనీస వసతులు లేవు. పల్లె ప్రజలకు గుక్కెడు మంచినీళ్లు దిక్కు లేవు.' అని కేటీ-ఆర్ నేటి దుస్థితిని వివరించారు. చివరికి రాష్ట్రంలో పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు. మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరం. ఢిల్లీ పార్టీలను నమ్మిన పాపానికి పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి జనం కర్రుకాల్చి వాతపెడుతరని హెచ్చరించారు.

# మెట్రోరైలు ఎండీకి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్,మెట్రో రైలు లో బెట్టింగ్ ప్రమోషన్ పై హైకోర్టు విచారణ చేపట్టింది. మెట్రో రైల్లో బెట్టింగ్ ఆప్ ప్రమోషన్‌పై హైకోర్టులో పిల్ దాఖలైంది. అడ్వకేట్ నాగూర్ బాబు ఈ పిల్ దాఖలు చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు లిమిటెడ్ బోర్డ్ డైరెక్టర్స్ పై సీబీఐ ఎంక్వయిరీ వెయ్యాలని అందులో పేర్కొన్నారు. రోజుకి 5 లక్షల మంది ప్రయాణించే మెట్రో రైలులో ఐఏఎస్, ఐపీఎస్ లు బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ గా ఎలా ప్రమోషన్ అనుమతిస్తున్నారని ప్రశ్నించారు. హెచ్ఎంఆర్ఎల్ లేదా అనుబంధ సంస్థలు ఇల్లిగల్ బెట్టింగ్ అప్ ప్రమోట్ చేయడానికి ఎన్నికోట్ల ముడుపులు తీసుకొన్నారో ఈడీ దర్యాప్తు చేయాలని పిటిషనర్ కోరారు.. తెలంగాణ గేమింగ్ అమండమెంట్ యాక్ట్ 2017, అమల్లో ఉందని పిటిషనర్ కోర్టుకు తెలిపారు.. పిటిషన్‌పై విచారించి హైకోర్టు మెట్రో రైలు ఎండీకి నోటీసులు జారీ చేసింది.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతి వాదులకు




హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

# వీసా గడువు తీరిన చాలా మంది బంగ్లా, పాక్ దేశస్థులు హైదరాబాద్‌లో ఉన్నారు..



హైదరాబాద్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ సూచించారు. వీసా గడువు తీరిన చాలా మంది బంగ్లా, పాక్ దేశస్థులు హైదరాబాద్‌లో ఉన్నారన్నారు. వీరందరిని వెంటనే వెనక్కి పంపి వేయాలని డిమాండ్ చేశారు. వీరి ఏరివేతకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్ లో స్లీపర్ సెల్స్ ఉన్నారని గతంలో చాలా సందర్భాల్లో రుజువైందని.. స్లీపర్ సెల్స్ కు హైదరాబాద్ ఎంపీ మద్దతు ఉందని ఆరోపించారు. దీంతో పాటు బీఆర్ఎస్ ఉత్సవాలపై కూడా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడారు. "బీఆర్ఎస్ ఏం సాధించిందని ఉత్సవాలు జరుపుతున్నారు? యువరాజుకి పట్టం కట్టేందుకు ఉత్సవాలు చేస్తున్నారా? బీర్ఆర్ఎస్ రూలింగ్ లోనే కాదు%ా% ప్రతిపక్షంలో కూడా ఫెయిలైన పార్టీ. బీఆర్ఎస్ కు సేనాధిపతి తిరుగుబాటు తప్పదు. మిషన్ కోసం ఏర్పాటు చేసిన పార్టీ కమీషన్‌లు తీసుకుంది. నాలుగు కోట్ల మంది కొరకు పార్టీ అని ఒక్క కుటుంబానికే పరిమితం చేశారు. బీఆర్ఎస్‌కు ఉత్సవాలు జరుపుకునే అర్హత లేదు." అని మండిపడ్డారు.

# క్షిపణి పరీక్షకు పాక్ ఆదేశాలు.. భారత్ అప్రమత్తం..

న్యూఢిల్లీ,పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్ మరింత కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది. తాజాగా క్షిపణి పరీక్షకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏప్రిల్ 24-25 తేదీల్లో అనగా గురు, శుక్రవారాల్లో ఉపరితలం నుంచి ఉపరితలం వరకు కరాచీ తీరం వెంబడి క్షిపణి పరీక్ష నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భారత్ అప్రమత్తం అయింది. పాక్ చర్యలను భారత్ రక్షణ వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి.

పహల్గామ్ దాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే దౌత్యవేత్తలను ఖాళీ చేయాలని ఆదేశించింది. అలాగే పాకిస్థాన్ ఎక్స్ ట్విట్టర్ ఖాతాను నిలిపివేసింది. అంతేకాకుం డా పాకిస్థాన్ వీసాలను రద్దు చేసింది. ఇక కేబినెట్ భేటీలో సింధు జలాలను నిలిపివేయాలని నిర్ణయం తీసుకుంది. ఇలా భారత్ కఠిన నిర్ణయాలు తీసుకు ంటున్న నేపథ్యంలో పాక్ భయపడింది. భయంతో గురు-శుక్రవారాల్లో క్షిపణి పరీక్ష చేయాలని పాక్ ఆదేశించింది. అరేబియా సముద్ర తీరంలో క్షిపణులను పరీక్షించాలని సంకేతాలు ఇచ్చింది. దీంతో భారత్ దర్యాప్తు సంస్థలు అప్రమత్తం అయ్యాయి. ఈ పరిణామాలపై నిఘా పెట్టాయి. ఇక కేంద్ర హోంశాఖ కూడా అప్రమత్తం అయింది. ఉన్నతాధికారులతో హోంశాఖ చర్చలు జరుపుతోంది. మంగళవారం




పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడిలో 26 మంది టూరిస్టులు చనిపోయారు. పదుల కొద్దీ గాయపడ్డారు. ఇక మృతదేహాలను అధికారులు స్వస్థలాలకు తరలించారు. ప్రస్తుతం జమ్మూకాశ్మీర్ నుంచి టూరిస్టులు ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. ఇక ఉగ్ర దాడికి నిరసనగా గురువారం కాశ్మీర్‌లో సంపూర్ణ బంద్ కొనసాగుతోంది. చిక్కుకున్న టూరిస్టులకు 15 రోజులు ఉచిత బస కల్పిస్తామని హొటళ్లు ముందుకొచ్చాయి.

# పంచాయితీ డబ్బులు పంచాయితీకే ఖర్చు పెట్టాలి..




అమరావతి,పంచాయితీ డబ్బులు పంచాయితీకే ఖర్చు పెట్టాలని స్పష్టం చేశారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవానికి హాజరయ్యారు పవన్..ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.. పహల్గామ్ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం ప్రకటించి సభను ప్రారంభించిన పవన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాలు భారతదేశానికి పట్టుకొమ్మలు.. గ్రామాలే స్వయంప్రతిపత్తి కల వ్యవస్థలుగా ఏర్పడాలి.. పల్లెల అభివృద్ధి చాలా కీలకం.. కక్ష సాధించం ఎవరిమీదా.. పంచాయితీ డబ్బులు పంచాయితీకే ఖర్చు పెట్టాలని స్పష్టం చేశారు.. సీఎం చంద్రబాబు నాయకత్వ మీద నమ్మకంతో డబ్బులు ఇవ్వకపోయినా పనులు చేసిన కాంట్రాక్టర్లకు ధన్యవాదాలు తెలిపారు.. ఫైనాన్షియల్ ప్లానింగ్ లో కొంత కొరత ఉంది.. అందువల్లే నిధుల విడుదల ఆలస్యం అయింది అన్నారు. ఇక, పంచాయితీరాజ్ లో గతంలో బదిలీలు నుంచీ ప్రతీదానికీ డబ్బులు నేను పని చేసేవాళ్ళని, సమర్ధతని, ఇంటెగ్రిటీ ఉన్న అధికారులను వెతికి పట్టుకోమని చెప్పాను అన్నారు పవన్ కల్యాణ్.. గత ఐదేళ్ళలో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం లాంటి సందర్భం చూడలేదు.. ఏ పార్టీ గ్రామంలో ఉన్నా గ్రామం గ్రామమే.. పార్టీలకు అతీతంగా పంచాయితీకి గౌరవం ఇచ్చాం.. పంచాయితీలను నిర్లక్ష్యం కాకుండా చూశాం.. ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తూ సోషల్ ఆడిట్ చేశాం అన్నారు.. ఉపాధి కూలీ అనే పదం మార్చి నరేగా శ్రామికులు లేదా గ్రామ వికాస శ్రామికులు అనే పదం వాడాలని సూచించారు. కూలీ అని బ్రిటీషర్స్ తెచ్చిన తక్కువ చేసి చూసే పదం.. కూలీ అనద్దు.. శ్రామికుడు అనండి.. గ్రామ సభల ద్వారా ప్రజల అవసరాలను గుర్తించి పనులు చేశాం.. 1005 కోట్లతో 601 ప్రాంతాలకు 1069 కిలోమీట్ల రోడ్లను అడవితల్లి బాటగా ఆమోదించాం.. రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ ర్యాంకింగ్స్ లో 24 ర్యాంకు నుంచీ 2వ స్థానానికి మన రాష్ట్రాన్ని తీసుకొచ్చాం అని వెల్లడించారు..కలప మొక్కల పెంపకం చేయాలనే ప్రణాళిక చేశాం.. కలపను దిగుమతి చేసుకునేవిధానం మార్చి ఆదాయ వనరుగా, వాతావరణ పరిస్థితులు సరిగా ఉండేలా కలపను పెంచాలని చూస్తున్నాం అన్నారు పవన్ కల్యాణ్.. కలప పెంపకం ద్వారా 20 వేల కోట్ల రూపాయల ఖర్చు తగ్గుతుందన్న ఆయన.. స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా మార్చడం కోసం పని చేస్తున్నాం.. రైల్వేకోడూరు ప్రాంతంలో ఒక గ్రామానికి అసలు రెవెన్యూ భూమి లేదు అని గుర్తించాం.. పంచాయితీల భూములు, ఆస్తులపై ఆడిట్ జరగాలి.. ఈ విషయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిడులు వచ్చినా నేను చూసుకుంటాను అన్నారు.. కాశ్మీర్ లో అయినా ఎక్కడ ఏం జరిగినా గ్రామాలు కూడా పట్టించుకోవాలి.. గ్రామాలు జాతీయ సమగ్రతకు పట్టుకొమ్మలు కావాలి.. 13326 పంపచాయితీలలో జాతీయ సమగ్రతా ప్రాంగణం.. జాతీయ సమగ్రతా స్థూపం ఉండాలని స్పష్టం చేశారు.. ఇక, కాశ్మీర్ లో మరణించిన వారి అంత్యక్రియలకు వెళ్తున్నాను.. కావలి, విశాఖకు వెళ్లనున్నట్టు వెల్లడించారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

# 'దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. ఉగ్రవాదులను మట్టిలో కలిపేస్తాం'

పాట్నా: జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తొలిసారి స్పందించారు. ఉగ్రవాదులకు బహిరంగంగా హెచ్చరికలు జారీ చేశారు. ఉగ్రవాదులు సప్తసముద్రాల అవతల దాక్కున్నా సరే వెతికి మరి మట్టిలో కలిపేస్తాం. 140 కోట్ల మంది సంకల్పం ఉగ్రవాదుల్నే కాదు వారిని పెంచి పోషిస్తున్న ఉగ్రవాద నాయకుల వెన్ను విరిచేస్తుంది' అని హెచ్చరించారు. ప్రధాని మోదీ గురువారం బీహార్‌లో పర్యటించారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా బీహార్ రాష్ట్రం మధుబని నగరంలో మౌలిక సదుపాయాలు, ప్రజా సేవలను బలోపేతం చేసేందుకు వీలుగా పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. రూ.13,480 కోట్లకు పైగా వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. సభలో మాట్లాడానికి ముందు పహల్గాం బాధితులకు రెండు నిమిషాల కళ్లు మూసుకుని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రసంగాన్ని ప్రారంభించారు.'పహల్గాం ఉగ్ర దాడిలో అమాయకులు చనిపోయారు. దేశ ప్రజలకు హామీ ఇస్తున్నా.. పహల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారం తీర్చుకుంటాం. టెర్రరిస్టులకు తగిన గుణపాఠం చెప్తాం. ఉగ్రవాదులను మట్టిలో కలిపే సమయం ఆసన్నమైంది. కార్గిల్ నుండి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ దుఃఖం, ఆగ్రహం ఉన్నాయి. ఈ దాడి కేవలం అమాయక పర్యాటకులపై మాత్రమే కాదు. భారత దేశ ఆత్మపై దాడి జరిగింది. దాడి చేసిన ఉగ్రవాదులు, దానికి కుట్ర పన్నిన వారికి మనం విధించే శిక్ష వారి ఊహకి కూడా అందదు. జమ్మూకశ్మీర్‌లోనే కాదు దేశంలో ఉగ్రవాదాన్ని నాశనం చేసేందుకు సమయం ఆసన్నమైంది. 140 కోట్ల మంది సంకల్పం ఉగ్రవాద నాయకుల వెన్ను విరిచేస్తుందన్నారు.

## సప్త సముద్రాల వెనుక దాక్కున్నా సరే

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'నేను ప్రపంచం మొత్తానికి



హామీ ఇస్తున్నా: భారత్ ప్రతి ఉగ్రవాదిని, వారికి వెనక ఎవరు ఉన్నా సరే వారిని గుర్తిస్తుంది. శిక్షిస్తుంది. ఉగ్రవాదులు సప్త సముద్రాల వెనుక దాక్కున్నా సరే వెంబడించి మరి మట్టిలో కలిపేస్తాం. ఉగ్రవాదం దేశ స్ఫూర్తిని ఎప్పటికీ విచ్ఛిన్నం చేయలేదు. ఉగ్రవాదానికి తప్పక శిక్ష పడుతుంది. న్యాయం జరిగేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సంకల్పంలో మొత్తం దేశం దృఢంగా ఉంది. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ మనతో ఉన్నారు. ఈ సమయంలో మనతో పాటు నిలిచిన ప్రపంచ దేశాల ప్రజలకు, వారి నాయకులకు నా కృతజ్ఞతలు'అని అన్నారు.

## యూఎస్ పర్యటన రద్దు చేసుకుని వచ్చిన రాహుల్

న్యూఢిల్లీ,పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ సభ్యుడు రాహుల్ గాంధీ అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. గురువారం ఉదయం న్యూఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ- (సిడబ్ల్యూసి) సమావేశానికి రాహుల్ గాంధీ చేరుకున్నారు.

## సంపాదకీయం

శుక్రవారం 25-04-2025

# అప్పగింతల్లో అవరోధాలెన్నో!

ముంబయి ఉగ్రదాడుల సూత్రధారుల్లో ఒకరిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న తహవ్వుర్ రాణాను ఎట్టకేలకు భారత్‌కు తీసుకొచ్చారు. ఇండియా ఎప్పట్నుంచో పట్టుకోవాలని యత్నిస్తున్న ఖలిస్థాన్ తీవ్రవాది హర్‌ప్రీత్‌సింగ్‌ను తాజాగా అమెరికాలో ఎఫ్‌బీఐ అరెస్టు చేసింది. అయితే, వివిధ నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ విదేశాల్లో తలదాచుకుంటున్న వారిని పట్టుకు రావడంలో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముంబయి ఉగ్రదాడుల సూత్రధారుల్లో ఒకరిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న తహవ్వుర్ రాణాను ఎట్టకేలకు భారత్‌కు తీసుకొచ్చా రు. ఇండియా ఎప్పట్నుంచో పట్టుకోవాలని యత్నిస్తున్న ఖలిస్థాన్ తీవ్రవాది హర్‌ప్రీత్‌సింగ్‌ను తాజాగా అమెరికాలో ఎఫ్‌బీఐ అరెస్టు చేసింది. అయితే, వివిధ నేరాల్లో ఆరోపణలు ఎదుర్కొంటూ విదేశాల్లో తలదాచుకుంటున్న వారిని పట్టుకు రావడంలో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. అమెరికా ఎఫ్‌బీఐ అధిపతిగా భారత మూలాలు కలిగిన కాశ్ పటేల్ బాధ్యతలు చేపట్టడంతో ఇరుదేశాల మధ్య సమన్వయం పెరిగినట్లు భావిస్తున్నారు. ప్రపంచ భద్రతకు ముప్పుగా పరిణమించే వ్యక్తుల్ని పట్టుకోవడంలో అంతర్జాతీయ సహకార ప్రాధాన్యం రాణా ఉదంతంతో తెలియవచ్చింది. విదేశాల్లో దాగిన నిందితులను తిరిగి తీసుకురావాలంటే ఆయా దేశాలతో మనకు ఒప్పందం ఉండాలి. ఇప్పటి వరకు ఇండియా 48 దేశాలతో ఎక్స్‌ట్రడిషన్ ట్రీటీ'లపై సంతకాలు చేసింది. మరో పన్నెండు దేశాలతో 'ఎక్స్‌ట్రడిషన్ అరేంజ్‌మెంట్స్' కుదుర్చుకుంది. గత అయిదేళ్లలో 23 మందిని విజయవంతంగా తీసుకొచ్చారు. భారత విదేశీ వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం పరారీలో ఉన్న నేరగాళ్లను అప్పగించాలంటూ ఇండియా వివిధ దేశాలకు 178 వినతులు సమర్పించింది. అయినా, నేరగాళ్ల అప్పగింత ఒప్పందాల విషయంలో ఇండియా వెనుకంజలోనే ఉంది. అమెరికా, యూకేలు వందకుపైగా దేశాలతో ఒప్పందాలు చేసుకున్నాయి. రష్యా, కెనడా, చైనా సైతం మనకన్నా మెరుగైన స్థితిలో ఉన్నాయి. భారత ప్రభుత్వానికి చిక్కకుండా పారిపోతున్న ప్రతి మూడో వ్యక్తీ అమెరికాలో దాక్కుంటున్నాడని, నేరగాళ్లకు ఉగ్రవాదులకు ఆ దేశం సురక్షిత స్థావరంగా మారుతోందని హోంశాఖ గతంలో వెల్లడించింది. నేరగాళ్ల అప్పగింతపై అమెరికాతో 1997లోనే ఒప్పందం కుదిరింది. నేరగాళ్ళు, ఉగ్రవాదుల కోసం భారత దర్యాప్తు సంస్థలు చేసిన వినతులు అమెరికా సర్కారు పరిశీలనలో 65దాకా ఉన్నాయి.

### దర్యాప్తు సంస్థలకు సవాలు

పరారీలో ఉన్న అపరాధుల కోసం భారత ప్రభుత్వం దౌత్య మార్గాల్లో తీవ్రంగా కృషి జరుపుతున్నా అంతగా ఫలించడం లేదు. నిందితుల్ని విదేశాల నుంచి పట్టుకురావడం దర్యాప్తు సంస్థలకు పెను సవాలుగా మారుతోంది. కొన్ని దేశాలతో ఒప్పందాలు ఉన్నా, లేకపోయినా–ఆయా దేశాల్లోని నిబంధనలు, మనదేశంలోని నియమాలు తదితర మరెన్నో అంశాలు కొన్నిసార్లు అడ్డంకిగా మారుతున్నాయి. దర్యాప్తులో ఆలస్యం, ఆధారాల సేకరణ, పత్రాల సమర్పణలో లోపాలు వంటి కారణాలన్నీ కలగలిసి ఆలస్యానికి దారితీస్తున్నాయి. దౌత్య మార్గాలు, ద్వైపాక్షిక సంబంధాలు, రాజకీయ పరిస్థితులు కూడా సమస్యలుగా మారుతున్నాయి. ఇలాంటి వాటిని ఎదుర్కొనేందుకు మనదేశం 'భారత్‌పోల్' పోర్టల్‌ను ప్రారంభించింది. ఇతర దేశాల దర్యాప్తు అధికారులతో సమన్వయంలో ఇది కీలక భూమిక పోషిస్తుందని భావిస్తున్నారు. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, వ్యవస్థీకృత నేరాలు, మాదక ద్రవ్యాల వ్యాపారం, మానవ అక్రమ రవాణా, సీమాంతర ఉగ్రవాదం ముప్పు అంతకంతకు పెరిగిపోతున్న పరిస్థితుల్లో భారత్‌పోల్ ద్వారా అంతర్జాతీయ సమన్వయాన్ని పెంపొందించుకోవచ్చని ఆశిస్తున్నారు. భారత పోలీసులు, ఇంటర్‌పోల్, ప్రపంచవ్యాప్తంగా వివిధ దర్యాప్తు ఏజెన్సీల మధ్య సమన్వయాన్ని పెంపొందించడంలో ఇది సింగిల్‌విండోలా పని చేస్తుంది. భారత్‌పోల్‌తో పలు రకాల ఇంటర్‌పోల్ డేటాబేస్‌లు అందుబాటులోకి వస్తాయని, నేర నిరోధక వ్యూహాలను రూపొందించడం, నేరగాళ్లను పట్టుకోవడం మెరుగవుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. సైబర్ నేరాల సవాళ్లను మరింత సమర్థంగా ఎదుర్కోవచ్చన్నారు.

### ఎక్కువ దేశాలతో ఒప్పందాలు

ఇటీవల చట్టాల సంస్కరణలతో పరారీలో ఉన్న నేరగాళ్లను వాళ్ల గైర్హాజరీలో విచారణ చేపట్టే అధికారం కోర్టులకు దక్కింది. దీంతో విదేశాల్లోని నేరగాళ్లను పట్టుకొచ్చే మార్గాలు మెరుగవుతాయని భావిస్తున్నారు. నేరగాళ్ల అప్పగింత ఒప్పందాల్లోని విధివిధానాలు కొన్నిసార్లు ఆటంకాలుగా మారుతున్నాయి. ఇలాంటి సవాళ్లపై ఇండియా నిర్దిష్ట లక్ష్యంతో పనిచేయడం ద్వారా విజయాల శాతాన్ని పెంచుకోవాలి. ఆయా దేశాలతో దౌత్య సంప్రదింపులు, ద్వైపాక్షిక బేరసారాలను నిరంతరం కొనసాగించాలి. సాధ్యమైనన్ని ఎక్కువ దేశాలతో ఒప్పందాలు కుదిరితే, పరారీలో ఉన్న నేరగాళ్లను పట్టుకొచ్చే అవకాశాలు మరింత మెరుగవుతాయి. దేశంలో జైళ్ల స్థితిగతులు మెరుగుపరచాలి. మానవ హక్కుల పరిరక్షణపై విశ్వసనీయత పెంచాలి. కస్టడీ హింస లేని పరిస్థితులు కల్పించాలి. దర్యాప్తు సంస్థలకు సాధన సంపత్తిని సమకూర్చి, వాటి పనితీరును పెంచాలి. ఇతర దేశాలతో వ్యవహరించే విషయంలో సరైన పత్రాల సేకరణ, సమర్పణ నిర్దిష్టంగా సాగాలి. ఇందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేయడం సముచితం. అధునాతన సాంకేతికతను ఒడుపుగా వాడుకుంటూ ముందడుగు వేయాలి. ఇలాంటి కేసుల పరిశీలనకు ప్రత్యేక ఏజన్సీని ఏర్పాటు చేయాలన్న నిపుణుల సూచనలు అమలుకు నోచుకోవాలి. ఈ క్రమంలో అవసరమైన సంస్కరణలను వేగంగా అమలు చేయడం ద్వారా పరారీలో ఉన్న నేరగాళ్లను తిరిగి తీసుకొచ్చే కసరత్తును సమర్థంగా ముందుకు నడిపించాలి.

# నాటి పాలకుల పాపమే నేటి కాశ్మీర్ హింస !



న్యూఢిల్లీ,దేశ విభజన తెచ్చి పెట్టిన చిచ్చు ఇంకా రావణ కాష్టంలా కాలుతూనే ఉంది. మత ప్రాతిపదికన దేశాన్ని ముక్కలు చేసిన కాంగ్రెస్ పెద్దలు ఇప్పుడు సమాధానం చెప్పడం లేదు. ఆనాడు దేశాన్ని విభజించకుండా మహాత్ముడు కూడా అడ్డుకోలేక పోయాడు. కేవలం నెహ్రూకు ప్రధాని పదవి కావాలన్న పట్టుదలతో దేశం ముక్కలైనా ఫర్వాలేదన్న రీతిలో ఆనాడు వ్యవహరించారు. దాని ఫలితాలను నేటికీ అనుభవిస్తున్నారు. సరిగ్గా దేశ విభజన జరగక పోడం, కాశ్మీర్ విషయంలో నాన్చివేత ధోరణి, 370 అధికరణ, యుద్ధాల్లో ఓడిన పాక్‌ను దయతలచి వదిలి పెట్టడం లాంటివన్నీ ఇవాళ మనకు గుదిబండగా మారాయి. ఆనాడే పటిష్టమైన విధానాలు అవలంబించి, ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనం చేసుకుని, పక్కాగా విభజన ఒప్పందాలు చేసుకుని ఉంటే ఇవాళ పాక్ తీవ్రవాదం నుంచి ముప్పును ఎదుర్కొని ఉండేవారం కాదు. ఆనాటి పాలకులు దూరదృష్టి లోపం కారణంగా దేశం ఇవాళ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.ఇకపోతే కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దయితే స్వాగతించాల్సిన కాంగ్రెస్ ఇతర పార్టీలు, ఎంఐఎం వంటి మతఛాందస పార్టీలు సంకుచిత రాజకీయాలు ప్రదర్శించాయి. ఇప్పటికీ ప్రదర్శిస్తున్నాయి. లక్షలాది మంది కాశ్మీరీ పండిట్లను ఊచకోత కోసినా, మతమార్పిళ్లు చేసినా పట్టించుకోని కాంగ్రెస్ తదితర పార్టీలు ఆర్టికల్ 370 గురించి చేసిన ప్రకటనలు ఉగ్రవాదులకు ఊతం ఇస్తున్నాయి. ఈ విషయంలో ఉగ్రవాదులకు అండ దక్కుతుందంటే అది మన పార్టీలు అవలంబిస్తున్న రాజకీయ వైఖరి అని చెప్పక తప్పదు. తాజాగా కాశ్మీర్‌లో నరమేథం అన్నది కేవలం... ఉగ్రదాడిగా చూడరాదు. పనిగట్టుకుని హిందువులే లక్ష్యంగా చేసిన దాడి. ఇది ముస్లిం ఉగ్రవాదుల పనే అయినా...ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సమాజం దీనిని ఖండించాలి. ఇలాంటి మతఛాందసాన్ని ఒప్పుకోబోమని ఉగ్రవాదులకు సందేశం ఇవ్వాలి. అలా చేయకుంటే వారి నిజాయితీ లేనివారుగా గుర్తించాలి. ముందుగా మనదేశంలో ఉన్న ముస్లిం పార్టీలు, ఎంఐఎం లాంటి పార్టీలు ఇందుకు బహిరంగా ప్రకటనలు చేసి ఉగ్రవాదుల దుశ్చర్యలను నిలదీయాలి. నిరసించాలి. పాలకపక్షంగా ఉన్న ఫరూక్ అబ్దుల్లా పార్టీ, మెహబూబా ముఫ్తీ పార్టీలు కూడా అసవరమైన నిరసన ప్రదర్శనలు చేయాలి. పాక్ తీరును ఎండగట్టాలి. కానీ పాక్ పాటపాడే వీరు అలా చేస్తారని అనుకోవడం భ్రమే అవుతుంది. కశ్మీర్ భూమిపై మరోసారి భారతీయుల ముఖ్యంగా హిందువలను లక్ష్యంగా చేసుకుని చేసిన దాడిని ఏ మాత్రం క్షమించరాని నేరంగా చూడాలి. కాశ్మీర్‌లోనే కాదు..దేశంలో ఉగ్రవాదుల చర్యలను ఉపేక్షించరాదు. శాంతి వచనాలు పలకుతూ పోతే వారికి బుద్ధి రాదు. సెలవుల్లో ఆహ్లాదంగా గడుపుదామని పహల్గామ్ సందర్శించ డానికి వెళ్లిన పర్యాటకులు లక్ష్యంగా ముష్కర మూక జరిపిన దాడిని ఒక్క ఖండనతో వదిలిపెట్టరాదు. కొత్తగా పెళ్లయిన జంటలు ఆనందంగా కాలక్షేపం చేద్దామని వెళితే భర్త కాటికి చేరగా భార్య గూడు చెదరి కన్నీరు మున్నీరయ్యింది. ఇప్పటివరకు కాశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన అతిపెద్ద ఉగ్రవాద దాడిగా దీనిని పరిగణిస్తున్నారు. ఇందులో 28 మంది మరణించిన తీరు ఉగ్రవాదుల రాక్షస కాండకు నిదర్శనంగా చూడాలి. కాందహార్ విమానం హైజాక్ చేసినప్పుడు కూడా ఇలాగే ఉగ్రమూకలు ఎందరినో పొట్టన పెట్టుకున్నారు. పాకిస్థాన్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న 'లష్కరే తయ్యిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడికి తెగబడినట్లు ప్రకటించుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన అయిదుగురు ముష్కరులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని స్పష్టమయ్యింది. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది వారికోసం గాలిస్తున్నారు. అయితే.. ఇప్పుడు ఈ దాడి వెనక పాకిస్థాన్ హస్తం ఉందన్నదానికి అనుమానాలు అక్కర్లేదు. మనదేశంలో ఏ దాడి జరిగినా దాని మూలాలు అక్కడే ఉంటున్నాయి. ఇటీవల దాయాది దేశంపాక్ ఆర్మీచీఫ్ అసిమ్ మునీర్ మళ్లీ కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. అది తమ జీవనాడి అని, దానిని మర్చిపోలేమని వ్యాఖ్యానించారు. విదేశాల్లో నివసిస్తోన్న పాకిస్థానీయులంతా దేశ రాయబారులు. మీరు ఉన్నతమైన భావజాలం, సంస్కృతికి చెందినవారనే విషయాన్ని మర్చిపోకూడదు. మీరు మీ పిల్లలకు పాక్ స్టోరీ చెప్పాలి. హిందువులతో పోలిస్తే మనం భిన్నమని మన పూర్వీకులు భావించారు. మన సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, ఆశయాలు భిన్నం. అదే రెండు దేశాల సిద్ధాంతానికి పునాది వేసింది. ఈ దేశం ఏర్పాటు–కోసం మన పూర్వీకులు ఎంతో పోరాడారు. ఈ స్టోరీని తర్వాత తరాలకు చెప్పడం మర్చిపోవద్దు. అప్పుడే వారికి పాకిస్థాన్‌తో ఉన్న బంధం దృఢంగా ఉంటుందంటూ చేసిన వ్యాఖ్యలు ఏ రకంగా ఉగ్రవాదాన్ని ప్రేరేపించేదిగా ఉంది. నిజానికి భారత్‌లో వీరంతా ఎక్కడి వారు...ఎందుకు హిందువులతో పోరాడారు అన్న చరిత్ర కూడా చెప్పివుంటే బాగుండేది. ఓ రకంగా భారత్‌లో ఉగ్రదాడికి ఆర్మీ చీఫ్ మునీర్ వ్యాఖ్యలు ఊపిరి పోశాయని చెప్పాలి. అలాగే కశ్మీర్ గురించి మాట్లాడుతూ.. ఈ విషయంలో మా వైఖరి స్పష్టం. కశ్మీర్ సోదరులను మేం అలా వదిలేయం అంటూ బీరాలు పలికారు. నిజానికి కాశ్మీర్ చరిత్ర,భారతదేశ చరిత్ర తెలియని మూర్ఖుడుగా అతడిని గుర్తించాలి. మొత్తంగా పాక్ ఆర్మీ చీఫ్ వ్యాఖ్యలు చేసిన వారంలోపే దాడి జరిగిందన్నది గుర్తించాలి. దీంతో పాకిస్థాన్ సైన్యం, పాక్ ప్రభుత్వంపై కూడా అనుమానాలు బలపడుతున్నాయి. ఈ దాడికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాదులను నిందిస్తూ భారతదేశం వైపు నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక వ్యాఖ్య వెలువడ నప్పటికీ.. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ముందుగానే స్పందించడంపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు భారత ప్రభుత్వం లేదా భారత సైన్యం ఈ దాడిపై ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ.. ఈ ఉగ్రదాడితో పాకిస్థాన్ కు ఎటువంటి సంబంధం లేదు. ఇదంతా ఆదేశంలో పుట్టిందే. భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉద్యమాలు, విప్లవాలు జరుగుతున్నాయి. ఒకటి కాదు, రెండు కాదు.. డజన్ల కొద్దీ ఉద్యమాలు జరుగుతున్నాయి. నాగాలాండ్ నుంచి కాశ్మీర్ వరకు, దక్షిణాన ఛత్తీస్‌గఢ్, మణిపూర్ లాంటి ప్రదేశాలన్నింటిలోనూ భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వరుస ఘటనలు చూస్తుంటే పాకిస్థాన్‌పైనే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా ఈ నరమేథంతో మనం మరింత అప్రమత్తం కావాలి. ఉగ్రవాదుల ఏరివేతలో మరితం కఠినంగా ఉండాలి. బుజ్జగింపు రాజకీయాలు చేసే పార్టీలను ప్రజలు నిలదీయాలి. కాశ్మీర్ 370 ఆర్టికల్ గురించి మాట్లాడే కాంగ్రెస్, ఎంఐఎం , అబ్దుల్లా పార్టీలను ఎండగట్టాలి. ప్రజలు ఒక్కటిగా నిలబడి బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వాలి.

# అరుదైన వ్యక్తిత్వం పోప్ ఫ్రాన్సిస్ సొంతం

రోమ్,మానవతావాదిగా పోప్ ఫ్రాన్సిస్‌ది సమకాలీన ప్రపంచంపై చెరగని ముద్ర వేశారు. వాటికన్ సిటీలో ఉండే మతపెద్దలు ఎప్పుడూ ప్రపంచశాంతిని కోరుకునే వారే. మత ఛాందసం ఎక్కడా వారు తమ ఛాయలకు రానీయరు. తాము ఫలానా మతానికి పెద్దలమైనా..సర్వమానవాళిని కోరుకునే వారుగానే నిలిచారు. ఈ క్రమంలో మరో అడుగు ముందుకు వేసి ప్రపంచ శాంతితో పాటు, ప్రజల పక్షాన నిలిచిన పోప్‌గా ఫ్రాన్సిస్ పేరు గడించారు. కేవలం మాటలకే కాకుండా ప్రపంచ శాంతి కోసం తనవంతుగా ప్రయత్నం చేశారు. అందుకే పోప్ ఫ్రాన్సిస్ విలక్షణ వ్యక్తిత్వాన్ని ప్రశంసిస్తూ విశ్వవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే మరణించిన పోప్ ఫ్రాన్సిస్ అత్యంత సామాన్య జీవితం నుంచి వచ్చి పోప్ స్థాయికి ఎదిగారు. అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్ వలస వచ్చిన ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన జార్జ్ మారియో బెర్గోగ్లియో నైట్‌క్లబ్ బౌన్సర్‌గా జీవితాన్ని ప్రారంభించారు. సొసైటీ ఆఫ్ జీసస్‌లో చేరి కాథలిక్ ప్రీస్ట్ నుంచి అత్యున్నత పోప్ పదవిని చేపట్టడానికి పేదల పట్ల కరుణ, దయ, వినమ్రతే ప్రధాన కారణం. అర్జెంటీనా నుంచి తొలుత బాధ్యతలు చేపట్టిన వ్యక్తిగా చరిత్రకెక్కిన ఆయన తన పేరును పేదల కోసం పాటుపడిన సెయింట్ ఫ్రాన్సిస్‌లోని ఫ్రాన్సిస్‌గా మార్చుకోవడం మానవత్వానికే తన ప్రాధాన్యత అని చాటిచెప్పారు. విలాసవంతమైన రాజభవనాల్లో, అడుగడుగునా హంగు ఆర్భాటాలతో జీవించే మత పెద్దలందరికీ ఫ్రాన్సిస్ భిన్నం. జీవితాంతం నిరాడంబరతను చాటిచెప్పడమే గాకుండా ఆచరించి చూపాడు. వృద్ధులు, ఖైదీల కాళ్లు కడిగి ముద్దుపెట్టుకోవడం అణగారిన వర్గాలకు సన్నిహితంగా, అండగా ఉండాలనే తపనను గుర్తు చేస్తుంది. వాటికన్‌లో తన తొలి ఈస్టర్‌కు ముందుగా ఇటలీ ద్వీపకల్పమైన లాంపెడుసాను ఎంపిక చేసుకోవడమే కాదు... 88వ ఏట... తీవ్ర అస్వస్థతతో ఉన్నా, తన మరణానికి ముందురోజున ఈస్టర్ నాడూ సామాన్యులను కలుసుకోవడం ఆయన విశిష్టత. యూరప్ చేరుకునేందుకు వేలాదిమంది శరణార్థులు ప్రవేశించే లాంపెడుసాను ఎంచుకోవడం ప్రపంచీకరణ పేదల పట్ల చూపే ఉదాశీనతకు నిరసన. ప్రమాదకరంగా సముద్ర ప్రయాణాలు చేస్తూ మరణిస్తుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పుల వల్ల పేద దేశాలకు జరుగుతున్న అన్యాయానికి ధనిక దేశాలదే బాధ్యత అని కుండబద్దలు కొట్టి పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా బయటకు రావడాన్ని నిరసించిన తీరు ఆయనలోని మానవతావాదిని గుర్తు చేస్తుంది. అమెరికన్ కాంగ్రెస్‌లో ప్రసంగించిన తొలి పోప్ కూడా ఫ్రాన్సిసే. భూమిని, ప్రకృతిని, వాతావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రపంచంలోని అత్యంత ధనిక దేశానిదేనని నిస్సంకోచంగా చెప్పారు. మెక్సికోకు వ్యతిరేకంగా సరిహద్దు గోడను ట్రంప్ తన తొలి విడత పదవీ కాలంలో నిర్మించడం క్రైస్తవ విరుద్ధమైన చర్య అంటూ ఖండించారు. ఇటీవల శరణార్థులను అమానవీయంగా సంకెళు వేసి తరలించడంపైనా గళమెత్తారు. ప్రపంచ దేశాల మధ్య సయోధ్య, ప్రేమ, సత్సంబంధాల పెంపులోనూ ఆయన ముద్ర ఉంది. అమెరికా, క్యూబాల మధ్య చారిత్రక సయోధ్యకు, కొలంబియాలో శాంతికి తన వంతు ప్రయత్నాలు చేశారు. మత బోధకులు పిల్లల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడటంపై సమాజానికి క్షమాపణ చెబుతూనే... వారి పట్ల, అవినీతికి పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత. మరణ శిక్షను, పచ్చి మితవాద భావజాలాన్ని నిరసించారు. యుద్ధాలను మానవతకు ఓటమిగా నిర్వచించడంతోపాటు–మూడో ప్రపంచయుద్ధం తప్పదంటూ హెచ్చరించారు. యుద్ధాలు, అరాచకాల వల్ల కాందిశీకులుగా మారిన వారికి కాథలిక్ సంస్థల ద్వారా సహాయాన్ని అందించే ప్రక్రియను చేపట్టారు. ఇజ్రాయిల్, పాలస్తీనా, ఉక్రెయిన్ తదితర దేశాల అత్యున్నత స్థాయి బృందాలతో మాట్లాడి, యుద్ధాలను ఆపివేయాలంటూ శాంతి సందేశాన్నిచ్చారు. రోమన్ కాథలిక్‌లలో ఉన్నత స్థానాల్లో పురుషులకే స్థానం కల్పించే సాంప్రదాయానికి స్వస్తి పలికి, అనేక మంది మహిళలకు ఉన్నత స్థానాలిచ్చారు. పోప్‌గా లభించే అధికారాన్ని అనుభవించడం కన్నా, సామాన్య ప్రజల కష్టసుఖాలు తనవిగా భావించి, సమాజానికి మేలు చేయాలని భావించిన ఆయన కాథలిక్ సమాజానికే కాదు, మత పెద్దలందరికీ ఆదర్శనీయంగా నిలిచారు. తన 88వ ఏట మరణించినా, ఆయన ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా ఉండిపోతారు.

# ఊరిస్తున్న వాన్స్ టూర్...



న్యూఢిల్లీ,అమెరికా విధించబోయే సుంకాల గురించి మనతో సహా ప్రపంచమంతా బెంబేలు పడుతున్న వేళ, అక్కడ చదివే మన విద్యార్థులు, వృత్తిగత నిపుణులు వీసా సమస్యలతో సతమతమవుతున్న వేళ నాలుగు రోజుల వ్యక్తిగత పర్యటన కోసం ఆ దేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కుటుంబ సమేతంగా సోమవారం మన గడ్డపై అడుగుపెట్టారు. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఎంతో ఇష్టుడైన నేత కనుక ఆయన ద్వారా కొన్ని సమస్యలైనా పరిష్కారమవుతాయన్న విశ్వాసం మన దేశానికున్నట్టుంది.అందుకే కావొచ్చు... ప్రోటోకాల్స్ పక్కనబెట్టి మరీ ఆయనకు ఘనస్వాగతమిచ్చారు. మారిన పరిస్థితుల రీత్యా అమెరికాతో కొత్తగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడం మన దేశానికి తప్పనిసరి. ఇప్పటికే ఆ విషయంలో ఇరు దేశాల మధ్యా సంప్రదింపులు సాగుతున్నాయి. ఒప్పందాలకు సంబంధించి అనుసరించాల్సిన విధివిధానాలు ఖరారయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన తర్వాత వాన్స్ ప్రకటించారు. దాదాపు 60 దేశాలపై సుంకాలను భారీ యెత్తున పెంచుతూ ఈ నెల 2 నుంచి అమల్లోకొస్తాయని ప్రకటించిన ట్రంప్, ఆ తర్వాత 90 రోజుల పాటు నిలిపివేశారు. కేవలం చైనాపై మాత్రమే అవి కొనసాగుతున్నాయి. పాత ఒప్పందాల స్థానంలో కొత్తవి కుదుర్చుకోవటం, తమకు మరింత మేలు కలిగేలా చేసుకోవటం ట్రంప్ ధ్యేయం. అందుకోసమే మూడు నెలల కొత్త గడువు విధించారు.నాలుగేళ్ల క్రితం రిపబ్లికన్ పార్టీకీ, ప్రత్యేకించి ట్రంప్‌కూ తీవ్ర వ్యతిరేకి అయిన జేడీ వాన్స్ ట్రంప్ తొలి దశ పాలనలోనే ఆయనకు మద్దతుదారుగా మారారు. గడచిన వంద రోజులుగా ఉపాధ్యక్షుడిగా ఆయన వ్యవహార శైలి గమనిస్తే రిపబ్లికన్ పార్టీలో ఆయన ముమ్ముందు కీలకపాత్ర పోషించే అవకాశాలున్నాయని సులభంగానే చెప్పొచ్చు. ఆ మితవాద పక్షానికి ఆయన సరికొత్త స్వరంగా మారారు. ట్రంప్‌ను ఏయే అంశాల్లో ఇంతవరకూ వాన్స్ ఒప్పించారన్నది ఎవరికీ తెలి యదుగానీ... ఆయన విజన్‌ను తు.చ. తప్పకుండా పాటిస్తున్న నేతగా ఇప్పటికే నిరూపించు కున్నారు. మ్యూనిక్ భద్రతా సదస్సు సందర్భంగా ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మారిన అమెరికా వైఖరిని నిక్కచ్చిగా చెప్పటంలో వాన్స్ విజయం సాధించారు. యూరప్ దేశాలు నొచ్చుకున్నా ఆయన ఖాతరు చేయలేదు. బ్రిటన్ విధానాలను దుయ్యబట్టారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని మందలిస్తున్న ట్రంప్‌తో గొంతు కలిపారు. గ్రీన్‌ల్యాండ్‌ను కొనితీరాలన్న ట్రంప్ అభిమతానికి అనుగుణంగా చెప్పాపెట్టకుండా కుటుంబ సమేతంగా వాన్స్ అక్కడికెళ్లారు. ప్రస్తుతం రక్షణ, విదేశీ వ్యవహారాలు డెన్మార్క్‌కు అప్పగించటం మినహా ఇతరత్రా స్వయం ప్రతిపత్తిని అనుభవిస్తున్న గ్రీన్‌ల్యాండ్‌కుగానీ, డెన్మార్క్‌కుగానీ ఈ ప్రతిపాదన ఇష్టం లేదు. ట్రంప్ మాదిరే స్వేచ్ఛా వాణిజ్యాన్ని, ఉదారవాద ఆర్థికవిధానాలనూ, భారీ వలసలనూ వాన్స్ తీవ్రంగా వ్యతిరేకిస్తారు. వాన్స్ అంటే వల్లమాలిన అభిమానం ఏర్పడటానికి ట్రంప్‌కు చాలా కారణాలున్నాయి. వాన్స్ లోని రచనా శక్తి అందులో ఒకటి. ఒకప్పుడు తనను 'అమెరికన్ హిట్లర్' అన్నా దాన్నంతటినీ మరిచి పోయే స్థాయిలో వాన్స్ ఆత్మకథాత్మక నవల 'హిల్‌బిల్లీ ఎలిజీ' ట్రంప్‌ను కట్టిపడేసింది. 2022లో ఆయనను ఒహాయో సెనెటర్‌ను చేయటమేగాక, అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ ఉపాధ్యక్ష అభ్యర్థిగా నిర్ణయించటానికి కూడా ఆ నవల ఉపకరించింది. శ్వేతజాతి అమెరికన్ జనాన్ని కూడగట్టడంలో, డెమాక్రాట్ల ఏలుబడిలో జరిగిన అన్యాయాలను ఏకరువు పెట్టడంలో ట్రంప్‌కు వాన్స్ నవల తోడ్పడిందని చెప్పాలి. పర్వత ప్రాంతాలను ఆనుకుని వుండే మారుమూల ప్రాంతాల్లో అక్షరాస్యతకూ, అభివృద్ధికీ దూరంగా వుండే శ్వేతజాతి అట్టడుగు వర్గాల జీవితాన్ని ఆ నవలలో వాన్స్ చిత్రీకరించారు. అరకొర పనులతో, అర్థాకలి బతుకులతో వెళ్లబుచ్చే జనాలను నేరుగా చూసిన ఆ ప్రాంతవాసిగా వాన్స్ దాన్ని ప్రభావవంతంగా చెప్పగలిగారు. ఆ అట్టడుగు జనం గురించి ట్రంప్ ఎంత మాట్లాడినా నవలలో వాన్స్ చిత్రించిన జీవితానుభవం ట్రంప్‌కు లేదు. అది తెలుసుకున్నాక ఆయన మరింతగా ఆ వర్గంలోకి చొచ్చుకుపోగలిగారు. అందుకే కావొచ్చు... ట్రంప్‌కు వాన్స్ అంటే ప్రత్యేకాభిమానం ఏర్పడింది. అలాగని ఆయనను తన వారసుడిగా ప్రకటించదల్చుకోలేదు. మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేయటాన్ని రాజ్యాంగం నిరాకరిస్తున్నా, దాన్ని ఎలాగోలా మార్చి మరోసారి ఆ పీఠాన్ని అధిష్ఠించాలని ట్రంప్ కలలుగంటున్నారు. అదెంతవరకూ కుదురుతుందో భవిష్యత్తే తేల్చాలి. అసాధ్యమైతే మాత్రం ట్రంప్ మొదటి ఎంపిక వాన్సే కావొచ్చు.గత ఆర్థిక సంవత్సరంలో ఇరు దేశాల వాణిజ్యం విలువ 12,920 కోట్ల డాలర్లు. మన నుంచి అమెరికా నిరుడు 8,740 కోట్ల డాలర్ల సరుకును దిగుమతి చేసుకుంది. మూడు నెలల తర్వాత మనపై 26 శాతం సుంకాలు విధిస్తే అక్కడి మార్కెట్‌లో మన సరుకుల ధర పెరిగి డిమాండ్ పడి పోవచ్చు. అందుకే ద్వైపాక్షిక చర్చలు అత్యవసరమయ్యాయి. తమను నష్టపరిచే విధంగా అమె రికాతో ఎవరైనా ఒప్పందం చేసుకుంటే ప్రతిచర్యలు తీసుకోవాల్సి వస్తుందని చైనా హెచ్చరించగా... ఆ దేశంతో పరిమిత వాణిజ్యమే నెరపాలని ప్రపంచ దేశాలకు ట్రంప్ చెబుతున్నారు. ఇది ముదిరితే పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారొచ్చు. వర్తమాన అంతర్జాతీయ పరిస్థితుల్లో దౌత్యం తాడు మీది నడక లాంటిది. దాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయటం అంత సులభమేం కాదు.గట్టిగా మాట్లాడి, అనుకున్నది సాధించటంలో మోదీకి మరెవరూ సాటిరారని వాన్స్ కితాబిచ్చారు. కుదరబోయే ఒప్పందాలు దాన్ని నిరూపిస్తే అంతకన్నా కావాల్సిందేముంది?

## ప్రజాభిప్రాయసేకరణలో మణికొండ వాసుల ఆవేదన

మణికొండ,'గుడ్ మార్నింగ్ మణికొండ' పేరుతో హైదరాబాద్‌లోని మణికొండ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ ప్రజాభిప్రాయ సేకరణను కొద్దిరోజులుగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం నాడు శ్రీరామ్‌నగర్ సెక్రటేరియట్ కాలనీలో ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను బీఆర్ఎస్ నాయకులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పనులు చేయడం కంటే.. పన్నులు వసూలు చేయడమే ఎక్కువగా ఉందని

# బిజెపి కార్యాచరణ

హైదరాబాద్, బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి మార్చాక బిజెపిలో కొంత ఊపు తగ్గింది. తెలంగాణలో అధికారంలోకి చచ్చే ఛాన్స్ ఉన్నా కోల్పోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు బిజెపి మళ్లీ పుంజుకునేలా యత్నాలు చేస్తోంది. ఈ దశలో కొత్త అధ్యక్షుడు ఎవరన్న చర్చ సాగుతోంది. సమర్థత కన్నా కులాల కుంపట్లు బిజెపిలో అగ్గి రాజేస్తున్నాయి. బిసిలకే అంటూ కొత్త నినాదం బయలు దేరింది. కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా, పార్టీ అధ్యక్షుడిగా ఇంకా కొనసాగుతున్నందన ఆయన అటు కేంద్రంలోనూ..ఇటు రాష్ట్రంలోనూ దృష్టి పెట్టాల్సి వస్తోంది. ఇదే క్రమంలో తెలంగాణలో పార్టీ పటిష్టతపైనా పెద్దలతో చర్చిస్తున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో ఓట్ల వేసేది ఎక్కువగా యువతేనని బీజేపీ భావిస్తోంది. సైలెంట్ ఓటింగ్ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా ఓటర్లలో యువ ఓటర్ల సంఖ్యనే ఎక్కువ. తెలంగాణలో మొత్తం 3కోట్ల 03లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి ఓటరు ఎన్‌రోలింగ్ జాబితాలో దాదాపు 4లక్షల మంది 18–19 సంవత్సరాల వయసు ఉన్న కొత్త ఓటర్లు చేరుతున్నారు. మొత్తం ఓటర్లలో యువ ఓటర్ల సంఖ్య కోటికిపైనే ఉంటుందని, ప్రతీ ఎంపీ , అసెంబ్లి సెగ్మెంట్‌లో వీరి ఓట్లు గెలుపోటములను నిర్ణయిస్తాయని బీజేపీ అంచనా వేస్తోంది.అందుకే యువత ఓట్లను పొందాలంటే జాతీయవాద అంశాలపై వరుస కార్యక్రమాలను నిర్వహించాలని బీజేపీ అధిష్టానం రోడ్ మ్యాప్ ఇచ్చినట్లుగా తెలస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో చాపకింద నీరులా విస్తరించి అధికారాన్ని చేజిక్కించుకోవాలని బీజేపీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. జాతీయవాద అంశాలతో ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించింది. జాతీయవాద అంశాలను ప్రజల్లో మరీముఖ్యంగా యువతరాన్ని ఆకట్టుకునేవిధంగా ప్రస్తావిస్తూనే స్థానిక సమస్యలను కూడా లేవనెత్తాలని భావిస్తోంది. ఎంపి ఎన్నికల్లో మంచి ఫలితాలు రావడంతో ఇప్పటి నుంచే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావాలని పార్టీ యోచిస్తోంది. జాతీయవాద అంశాలపై విస్తృత కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించడం వెనక యువత ఓట్లను కొల్లగొట్టడమే కాషాయ పార్టీ ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. దీర్ఘకాలిక వ్యూహం లక్ష్యంగా చేసుకుని వరుసగా జాతీయవాదాన్ని తట్టిలేపే కార్యక్రమాలకు రూపకల్పన చేసింది. అధిష్టానం ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి జిల్లాకు , ప్రతి అసెంబ్లి నియోజకవర్గానికి ప్రత్యేకంగా కో.ఆర్డినేటర్లను నియమించి పనిచేస్తోంది. ఇప్పటికే ఆరెస్సెస్ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఎలా సైలెంట్ గా ప్రచారం చేస్తుందో అలా తెలంగాణలోనూ కార్యచరణ ప్రారంభించింది. పోలింగ్ బూత్‌స్థాయిలో, మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో , రాష్ట్ర స్థాయిలో ప్రచార కార్యక్రమాలను ప్లాన్ చేసుకుంటున్నారు. దేశ విభజన సమయంలో చోటు చేసుకున్న మారణకాండపై ప్రచారం, దేశ విభజన గాయాలకు చెందిన ఫోటోలు, ఫీల్మ్‌లను, నాటి వార్తా పత్రికల ప్రతులను

# చేపల జాతరతో గుబాళింపు

ఏలూరు,పండగలు,జాతరలు అందరినీ కలిసికట్టుగా ఉంచే సంప్రదాయాలుగా చూడాలి. కలిసుంటే కలదు సుఖం అన్న నానుడి తగ్గట్టుగా .... ఏలూరు ఏజెన్సీలో చేపల జాతర జరిగింది. ఏకంగా 10 గ్రామాలు కలిసి చేపల జాతర జరుపుకున్నారు.. ప్రతీ ఇంట్లోనూ చేపల పులుసు గుభాళింపే..! ఏలూరు ఏజెన్సీలో ప్రజలు ఏడాదికి ఒక్కసారి సమిష్టిగా ఊరి చెరువులో చేపల జాతర నిర్వహిస్తుంటారు. వేసవి కాలంలో చెరువులో చేపలు పెట్టడం జాతరలా ఉంటుంది. పెద్ద ఎత్తున తరలివచ్చిన జనం నీళ్లలోకి దిగి, చేపలను పట్టి, వాటిని కుప్పలుగా పోసేవాళ్లు. సమానంగా జరిగే పంపకాలు.. ఇదే సమయంలో వినిపించే చలోక్తులు, సరదాగా సాగే దెప్పిపొడుపులు, అన్యాయం జరిగిందంటూ సాగే అలకలు. చిన్నా, పెద్దా , బాబాయ్, పిన్ని, అత్తా మామ అంటూ వినిపించే పలకరింపులు.. మొత్తం ఒక జాతరలా కనిపిస్తుంది. వచ్చిన చేపలన్నిటినీ అంతా సమానంగా పంచుకుని వండుకుని తింటారు. ఆ గ్రామాల్లో ప్రతి ఇంటా చేపల వంటకాలే..! ఈ ఏడాది కూడా అదే వాతావరణంలో కుక్కునూరు మండలం చీరవల్లిలో చేపలను పెట్టారు. ఈ చెరువు పరిసరాల్లో దాదాపు 10 గ్రామాల ప్రజలు నివసిస్తుంటారు. వర్షాకాలంలో నిండుకుండలా ఉండే చెరువులు వేసవిలో నీరు ఇంకిపోయి వెలవెల పోతుంటాయి. అదే సమయంలో గిరిజనులు అక్కడకు చేరుకుని చెరువులో దిగి చేపలను పెడతారు. బచ్చా, శీలావతి, కొరమేను, వాలుగా ఇలా చాలా రకాల చేపలు దొరికాయి. ఇక, వాటిని పంచుకుని ఎవరి వాటా వాళ్లు చేపలను తామర ఆకుల్లో ఉంచుకుని ఇళ్లకు తీసుకువెళ్లారు. ఇక మంచి ఘుమఘుమలాడే చేపల కూర వాసనలతో కుక్కునూరు పరిసర ప్రాంతాలు గత రెండు రోజులుగా గుభాళించాయి..

# ఇండియా ముందు ఉన్న దారులు ఇవే..

న్యూఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో పాకిస్తాన్ ప్రమేయం సుస్పష్టంగా కనిపిస్తోంది. మంగళవారం కాశ్మీర్ అందాలను చూసేందుకు పహల్గామ్ బైసరీన్ గడ్డి మైదానాలు చూసేందుకు వచ్చిన టూరిస్టుల్ని టార్గెట్ చేస్తూ ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 28 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. ముఖ్యంగా హిందువుల్ని టార్గెట్ చేస్తూ హత్యలు చేశారు. ఈ దాడికి లష్కరే తోయిబా అనుబంధ ఉగ్రసంస్థ "ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)" బాధ్యత ప్రకటించింది. ఈ దాడిపై ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన అత్యున్నత సమావేశం జరుగుతోంది. మరోవైపు అమిత్ షా కాశ్మీర్‌లో భద్రతా బలగాలతో సమీక్షిస్తున్నారు. ఇంకోవైపు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్( త్రివిధ దళాల అధిపతి), జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో భేటీ అయ్యారు. మరోవైపు, దేశ వ్యాప్తంగా ప్రజలు పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌పై భారీ ప్రతీకార చర్యలకు భారత్ సిద్ధమవుతోంది. పాకిస్తాన్‌ని సైనికంగా, దౌత్యపరంగా దెబ్బ కొట్టేందుకు భారత్ సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, మనదేశం నుంచి ప్రవహించే సింధు నది, దాని ఉపనదులకు సంబంధించిన "ఇండస్ వాటర్ ట్రిటీ"ని భారత్ రద్దు చేసుకుంటున్నట్లు సమాచారం. పాకిస్తాన్‌లోని భారత్ హైకమిషన్‌ని పూర్తిగా షట్ డౌన్ చేసే అవకాశం కనిపిస్తోంది. దీంతో భారత్, పాక్ మధ్య పూర్తి స్థాయిలో దౌత్య కార్యకలాపాలు నిలిచిపోతాయి. పహల్గామ్ దాడిలో ఉగ్రవాదుల హ్యాండర్లు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ముజఫర్‌నగర్ కేంద్రంగా కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో పీఓకే వెంబడి ఉగ్రవాద శిక్షణా కేంద్రాల్లోనే దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ట్రైనింగ్ తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పాక్‌లోని ఉగ్రవాద శిక్షణా కేంద్రాలపై భారత్ దాడి చేసే అవకాశం ఉంది. దాడికి సంబంధించి పాకిస్తాన్ ప్రమేయాన్ని ఆధారాలతో చూపించి, ఐక్యరాజ్యసమితిలోని అన్ని దేశాల ముందు పాక్‌ని దోషిగా నిలబెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది.

# విజిల్ బ్లోయర్!


అమరావతి,జగన్ కు అత్యంత విశ్వసనీయ సహచరుడు, వైసీపీ ఆవిర్భావానికి ముందు నుంచీ జగన్ తో కలిసి నడిచి, ఆఖరికి ఆయన అక్రమాస్తుల కేసులో కూడా సహనిందితుడిగా జైలు జీవితం కూడా అనుభవించిన విజయసాయి రెడ్డి ఇప్పుడు జగన్ కు పూర్తి వ్యతిరేకంగా మారిపోయారు. వైఎస్ కుటుంబంతో సుదీర్ఘ అనుబంధం, ఆ కుటుంబ ఆర్థిక వ్యవహారాలన్నీ చూసుకుంటూ వచ్చిన ఆడిటర్ అయిన విజయసాయి రెడ్డి ఇప్పుడు జగన్ హయాంలో కుంభకోణాల గుట్టుమట్లన్నీ విప్పుతానంటున్నారు. గత ఎన్నికలలో ఘోర పరాభవం తరువాత.. ఇంకా పార్టీకి ఏమైనా మిగిలి ఉన్న కొద్ది పాటి ప్రతిష్ఠనూ కూడా దిగజారుస్తానంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంతో సంబంధం ఉన్న ఒక్కరినీ వదిలిపెట్టకుండా అందరినీ బయటకు లాగుతానని చెబుతున్నారు. రాజ్ కసిరెడ్డి అరెస్టు అనంతరం సోషల్ మీడియా వేదికగా విజయసాయిరెడ్డి ఈ కుంభకోణంలో తనను తాను ఒక విజిల్ బ్లోయర్ గా అభివర్ణించుకున్నారు. సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ లో ఆయన ఏపీ మద్యం కుంభకోణంలో తన పాత్ర కేవలం విజిల్ బ్లోయర్ పాత్రేనని చెప్పుకున్నారు. అయితే ఈ కుంభకోణంలో దొరికిన దొంగలు, ఇంకా దొరకకుండా ఉన్న దొంగలూ కూడా తమను తాము కాపాడుకోవడానికి తన పేరు లాగుతున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణంలో ఇంకా దొరక్కుండా తప్పించుకుని తిరుగుతున్న దొంగల గుట్టుమట్లన్నీ తాను బయటపెడతానని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. నిన్న మొన్నటి వరకూ జగన్ తోనూ, ఆ అధినేతగా ఉన్న వైసీపీతోనూ అంటకాగి బయటకు వచ్చిన విజయసాయిరెడ్డి ఒక్క సారిగా యూటర్న్ తీసుకుని అందరి బాగోతం బయటపెడతానంటూ హెచ్చరికలు జారీ చేయడం వైసీపీ వెన్నులో వణుకు పుట్టిస్తోందనడంలో సందేహం లేదు. అందుకే రాజ్ కసిరెడ్డి అరెస్టు అయిన వెంటనే.. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ అధినేత జగన్ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజకీయ వ్యవహారల కమిటీతో అత్యవసర భేటీ ఏర్పాటు చేశారు. ఇక్కడ మరో విషయమేంటంటే.. విజయసాయి రెడ్డి సిట్ దర్యాప్తులో పాల్గొన్న రెండు రోజుల వ్యవధిలోనూ మద్యం కుంభకోణం కేసులో ఎంపీ విజయసాయిరెడ్డిని సిట్ విచారణకు పిలిచింది. ప్రశ్నలు సంధించింది. దీంతో విజయసాయిరెడ్డి వాంగ్మూలం ఆధారంగానే మిథున్ రెడ్డిని సిట్ విచారణకు పిలిచిందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అలాగే రాజ్ కసిరెడ్డే మద్యం కుంభకోణంలో కర్త కర్మ క్రియ అని విజయసాయి మీడియా ముఖంగా చెప్పిన తరువాతే ఈ కుంభకోణంలో రాజ్ కసిరెడ్డి ప్రమేయం గురించి అందరికీ తెలిసింది. కాగా విజయసాయి రాజ్ కసిరెడ్డి పేరు చెప్పిన వెంటనే ఆయన రియాక్ట్ అయ్యారు. విజయసాయిరెడ్డి చరిత్రను తానూ బయటపెడతానంటూ ఓ వీడియో విడుదల చేశారు. దీంతో విజయసాయి రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి మద్యం కుంభకోణంలో ఉన్న ప్రతి ఒక్కరి బాగోతాన్నీ బయటపెడతానంటూ ట్వీట్ చేశారు. గతంలో సంగతి ఏమో కానీ.. ఇప్పుడు మాత్రం వజియసాయి రెడ్డి విజల్ బ్లోయర్ గానే పని చేస్తున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. విజయసారి నోరు విప్పితే..

# పొత్తుతో చిత్తయ్యేదెవరు?

చెన్నై:గత లోక్‌సభ ఎన్నికలకు ముందు విడిపోయిన ఎఐఎడిఎంకె, బిజెపి పొత్తు ఒకటిన్నర సంవత్సరాల తర్వాత, 2026 ప్రారంభంలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరిగి ఏర్పర్చుకొనేందుకు రెండు పార్టీలు ముందడుగు వేస్తున్నాయి. 2021లో అధికారాన్ని కోల్పోయినప్పటి నుండి తన ప్రాబల్యాన్ని కోల్పోతూ వస్తున్న ఎఐఎడిఎంకె డిఎంకె నేతృత్వంలోని కూటమిని అధికారం నుండి తొలగించే ప్రయత్నాలలో బిజెపితో చేతులు కలిపేందుకు సిద్ధమవుతున్నది. మరోవంక, దక్షిణాదిన వ్యాప్తి చెందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించక పోవడంతో తమిళనాడులో బలం పెంచుకునేందుకు బిజెపి సైతం ఆత్రుతతో వ్యవహరిస్తున్నది. అయితే ఆ రెండు పార్టీలు తప్పనిసరి పరిస్థితులలో చేతులు కలుపుతున్నా ఆచరణలో పరస్పరం అవిశ్వాసంతో వ్యవహరిస్తున్నాయి. ఆయా పార్టీలలో సైతం పొత్తుకు సానుకూలమైన సంకేతాలు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా విధానం వంటి అంశాలను దూకుడుగా లేవనెత్తడంతో పాటు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సంఘర్షణకు దిగడం ద్వారా 'తమిళ్ ఫ్రైడ్' ఆయుధంగా ప్రజల సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. ఓ విధంగా రాష్ట్రరాజకీయాలపై ఆధిపత్యంతో వ్యవహరిస్తున్న డిఎంకెను ఎదుర్కొనేందుకు అవసరమైన సైద్ధాంతిక, రాజకీయ పటుత్వం ఎఐఎడిఎంకె– బిజెపి కూటమిలో కనిపించడం లేదు. బిజెపితో తిరిగి పొత్తు పెట్టుకోవడంపై ఎఐఎడిఎంకెలో అసంతృప్తి గుసగుసలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. చివరకు ఈ పొత్తులో కీలకంగా కనిపించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సైతం ఒత్తిడులు ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తున్నది. ఆయన మద్దతుతోనే బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఏకపక్షంగా వ్యవహరిస్తూ, అన్నాడిఎంకెను మాత్రమే కాకుండా పార్టీలో కీలక నేతలను సైతం దూరం చేసుకున్నారని తెలుస్తోంది. పొత్తు ప్రకటన కోసం చెన్నైకి రావడానికి రెండు రోజుల ముందు కొంతమంది బిజెపి కార్యకర్తలు ఢిల్లీ వెళ్లి ఆయనను కలిసి అన్నామలైను అధ్యక్ష పదవి నుండి తొలగించాలని కోరితే ఆయన తీవ్రమైన ఆగ్రవేశాలు వ్యక్తం చేశారు. నాయకత్వం విషయం తమకు వదిలివేసి బూత్ స్థాయిలో పార్టీ పని చూసుకోండి అంటూ మందలించి పంపించారు. నాయకులపై ఫిర్యాదు చేయడానికి ఢిల్లీకి రావద్దని హెచ్చరించారు. అయితే, ఎఐఎడిఎంకెతో పొత్తు కోసం ఏప్రిల్ 10న అమిత్ షా చెన్నైకి వచ్చినప్పుడు, దాని నాయకుడు ఇ కె పళనిస్వామి విమానాశ్రయంలో తనకు స్వాగతం చెప్పేందుకు రాకపోవడంతో ఖంగుతిన్నారు. ఆ రోజు సాయంత్రం అనుకున్న ఎన్‌డిఎ మీడియా సమావేశం బిజెపి సమావేశంగా మారింది. దానితో వెంటనే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురుమూర్తి వద్దకు వెళ్లి సమాలోచనలు జరిపారు. ఆ వెంటనే అన్నామలై సైతం వెళ్లి ఆయనను కలిశారు. అన్నాడిఎంకె– బిజెపి పొత్తులో మొదటి నుండి గురుమూర్తి కీలక భూమిక నిర్వహిస్తున్నారు. ఆ తర్వాతనే రాష్ట్ర అధ్యక్షుడిని మార్చడం, మరుసటి రోజు మాజీ అన్నాడిఎంకె నేత నైనార్ నాగేంద్రన్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకటించిన తర్వాతనే పొత్తు ఖరారు చేస్తూ అమిత్ షా ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి పళనిస్వామి రావడం జరిగింది. అయితే ఆ తర్వాత తమ పొత్తు సీట్ల సర్దుబాటు వరకే అని, ఎన్నికల అనంతరం తాము ఏర్పాటు చేయబోయే మంత్రివర్గంలో బిజెపి ఉండబోదని పళనిస్వామి ప్రకటించడం గమనార్హం. అన్నాడిఎంకెతో పొత్తు ప్రకటించిన తర్వాత ఇటీవలి సంవత్సరాలలో బిజెపి వైపు ఉన్న మాజీ ఎఐఎడిఎంకె నాయకులు, మాజీ సిఎం ఓ పన్నీర్ సెల్వం, తన సొంత పార్టీ ఎఎంఎంకెకు నాయకత్వం వహిస్తున్న టిటివి దినకరన్ వంటి వారు ఈ కూటమికి దూరంగానే కనిపిస్తున్నారు. బిజెపి– ఎఐఎడిఎంకె కూటమి అటువంటి పార్టీలను ఎన్‌డిఎ కూటమిలో ఎలా తీసుకురాగలదో చూడాలి. చెన్నైలో తమ కూటమిని ప్రకటిస్తూ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా బిజెపి ఎఐఎడిఎంకె అంతర్గత విషయాలలో జోక్యం చేసుకోదు లేదా తొలగించిన నాయకులను తిరిగి చేర్చుకోవాలని వారిని అడగదు. ఎటువంటి జోక్యం ఉండదు అని స్పష్టమైన హామీ ఇవ్వాల్సి రావడం గమనార్హం. 2016 ఎన్నికలలో స్వతంత్రంగా పోటీ చేసిన బిజెపి ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. దాని 188 మంది అభ్యర్థులలో ఎనిమిది మంది తప్ప మిగిలిన వారందరూ డిపాజిట్లు కోల్పోయారు. 2.8% వద్ద, బిజెపి ఓట్ల వాటా 2011 ఎన్నికలలో పొందిన 2.2% నుండి స్వల్పంగా మాత్రమే పెరిగింది. అంతకు ముందు లోక్ సభ ఎన్నికలకు మాత్రమే పరిమితమైన ఎఐఎడిఎంకె– బిజెపి పొత్తు మొదటిసారిగా 2021లో అసెంబ్లీ ఎన్నికలకు విస్తరించింది.

దానితో మొదటిసారిగా బిజెపి నాలుగు సీట్లు గెల్చుకోగలిగింది. ఆ పార్టీ రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లను గెలుచుకోవడం ఇది మూడోసారి మాత్రమే. ఎఐఎడిఎంకె సీట్ల సంఖ్య 66కు పడిపోయింది. చాలా సీట్లలో పోటీ చేసిన ఎఐఎడిఎంకె తన ఓట్ల వాటాను 33.3%కి తగ్గించుకుంది. అయితే, కేవలం 20 సీట్లలో పోటీ చేసినప్పటికీ బిజెపి ఓట్ల వాటా స్వల్పంగా 2.6%కి పడిపోయింది. సెప్టెంబర్ 2023 లో, ఎఐఎడిఎంకె నాయకత్వంపై అన్నామలై చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య సంబంధాలను తెంచుకొనే వరకు వెళ్లడంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేశాయి. డిఎంకె నేతృత్వంలోని ఇండియా బ్లాక్ రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడం ద్వారా తన ఆధిపత్యాన్ని కొనసాగించడంతో వారిద్దరూ ప్రభావం చూపలేకపోయారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలను అసెంబ్లీ స్థాయిలో పరిశీలిస్తే, ఒక్క సీటు కూడా గెలవలేకపోయినప్పటికీ, బిజెపి 59 సెగ్మెంట్లలో రెండవ స్థానంలో, 64 సెగ్మెంట్లలో మూడవ స్థానంలో నిలిచింది. వీటిలో, బిజెపి 56 అసెంబ్లీ సెగ్మెంట్లలో 20 శాతం కంటే ఎక్కువ ఓట్లను, 20 సెగ్మెంట్లలో 30 శాతం కంటే ఎక్కువ ఓట్లను సాధించింది. ఆ బలంతోనే వచ్చే ఎన్నికలలో తన ఉనికిని మరింతగా పెంచుకునేందుకు బిజెపి ఉత్సాహ పడుతున్నది. తమిళ పార్టీలు తమ సైద్ధాంతిక పటుత్వం కోల్పోయాయని, దానితో ఇప్పుడు జాతీయ రాజకీయ పార్టీలకు తమిళనాడులో అనువైన వాతావరణం ఏర్పడుతున్నదని తుగ్లక్ సంపాదకుడు ఎస్ గురుమూర్తి భావిస్తున్నారు. అందుకనే అన్నాడిఎంకె– బిజెపి కూటమిని తమిళ ప్రజలు ఆదరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, జయలలిత మరణం తర్వాత అన్నాడిఎంకె శ్రేణులు అందరినీ ఉమ్మడిగా తీసుకెళ్లగల నాయకత్వం ఆ పార్టీలో కనిపించడం లేదు. మరోవంక బిజెపిని 'తమిళ్ వ్యతిరేక' పార్టీగా ప్రజలు చుస్తున్నారని, అందుకనే ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని దెబ్బ తిన్నామని గతంలో ఆ పార్టీ నాయకులు బహిరంగంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి వ్యవహారం సైతం బిజెపిని 'తమిళ వ్యతిరేక' పార్టీగా చూపే ప్రయత్నాలకు ఊతం కలిగిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులే ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ రెండు సార్లు ఆమోదించిన బిల్లులను ఆమోదించకుండా పక్కన పడవేయడం ద్వారా సుప్రీం కోర్టు ద్వారా చివాట్లు తిన్న తర్వాత కూడా ఆయన వైఖరిలో మార్పు కనిపించడం లేదు. ఆ బిల్లుల్లో ఒక బిల్లు విశ్వవిద్యాలయాల వ్యవహారాలలో గవర్నర్ పాత్ర నామమాత్రమే అని స్పష్టం చేస్తుంది. ఏప్రిల్ 16న అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, రిజిస్ట్రార్‌లతో ముఖ్యమంత్రి స్టాలిన్ సమావేశం నిర్వహించారు. అయితే విశ్వవిద్యాలయాలపై ముఖ్యమంత్రి కన్నా తానే అధికుడని సంకేతం ఇచ్చేందుకు ఏప్రిల్ 25 నుండి మూడు రోజుల పాటు ఊటీలో అన్ని విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల సమావేశం ఏర్పాటుచేసి, దానికి స్వయంగా ఉపరాష్ట్రపతి జగదేవ్ ధంకర్‌ను ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఈ విధంగా సమావేశం ఏర్పాటు చేయడం సుప్రీంకోర్టు తీర్పు ధిక్కారమే అంటూ కేవలం డిఎంకే కూటమిలోని పక్షాలే కాకుండా అన్నాడిఎంకె,– బిజెపి కూటమిలోని పక్షాలు సైతం ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తున్నాయి. చివరకు బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు సైతం గవర్నర్ చర్యను సమర్థింపలేకపోతున్నారు. గవర్నర్ చర్యలు రాజకీయంగా డిఎంకె కూటమికి బలం చేకూరుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకనే తక్షణమే గవర్నర్‌ను మార్చాలని చూస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవంక, అన్నామలైని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకురావడం ద్వారా తమిళ రాజకీయాల్లో కీలక వ్యక్తిగా కొనసాగించాలంటూ అమిత్ షా చేస్తున్న ప్రయత్నాలు సైతం ఈ కూటమి సయోధ్యకు ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పరస్పర వైరుధ్యాల మధ్య ఈ కూటమి వచ్చే ఏడాది ఎటువంటి ఫలితాలు సాధించగలదో చూడాల్సి ఉంది.

# రంగంలోకి అజిత్ దోవల్.. ఇక టెర్రరిస్టులకు నరకమే,




జమ్ము కశ్మీర్: పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది..? ముష్కరులకు ధీటైన జవాబు ఇచ్చేదెలా..? అసలు కాశ్మీర్ నుంచి వారిని ఏరివేయడం సాధ్యమేనా..? ఇలాంటి ప్రశ్నల మధ్య కార్యసాధకుడిగా మనకు కనిపిస్తున్న ఏకైక వ్యక్తి, శక్తి అజిత్ దోవల్. అవును, దాడి జరిగిన సమయంలో సౌదీ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ, నేరుగా ఢిల్లీకి తిరిగి వచ్చి అజిత్ దోవల్ తోనే భేటీ అయ్యారు. ఈ భేటీలో విదేశాంగ మంత్రి జై శంకర్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కూడా పాల్గొన్నారు. అంతగా మోదీ నమ్మకం చూరగొన్న అజిత్ దోవల్ ఈ సమస్యకు పరిష్కారం చూపగలరా..?

ఎవరీ అజిత్ దోవల్..?

ప్రస్తుతం జాతీయ భద్రతా సలహాదారుగా అజిత్ దోవల్ మన దేశానికి సేవలందిస్తున్నారు. భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తినా, విదేశాలతో శతృత్వం మొదలైనా, యుద్ధ మేఘాలు కమ్ముకున్నా.. వెంటనే అజిత్ దోవల్ రంగంలోకి దిగుతారు. సామ, దాన, భేద, దండోపాయాలు ఉపయోగించి భారత్ కి మేలు చేస్తారు. అందుకే ఆయన భారత్ కి అంత స్పెషల్ గా మారారు. అందుకే ప్రధాని మోదీ.. భారత్ కి వచ్చీ రాగానే అజిత్ దోవల్ తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ఇదీ ట్రాక్ రికార్డ్..

1968 కేరళ కేడర్ కు చెందిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అజిత్ దోవల్. ప్రస్తుతం ఆయన వయసు 80 ఏళ్లు. అయినా కూడా ఆయన ఆలోచనలు చాలా చురుకు. ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అయినా స్థిత ప్రజ్ఞతతో నిర్ణయాలు తీసుకుంటారు. ప్రాణాపాయం అని తెలిసి కూడా కష్టమైన ఆపరేషన్లకు సైతం ఆయన అప్పట్లో నాయకత్వం వహించేవారు. ఆయన ట్రాక్ రికార్డ్ చూసే ఆయన్ను జాతీయ భద్రతా సలహాదారుగా నియమించారు. ఆ పదవికి తగ్గట్టే ఆయన ఇప్పటి వరకు భారత ప్రభుత్వానికి కీలక సలహాలిచ్చారు. విదేశీ దౌత్య సంబంధాలు దెబ్బతినకుండా, అదే సమయంలో భారత సార్వభౌమాధికారానికి ఇబ్బంది కలగకుండా వ్యవహరించారు.

తొలి విజయం..

1988లో అమృత్ సర్ లోని స్వర్ణ దేవాలయంలో చొరబడ్డ ఖలిస్తాన్ వేర్పాటువాదుల్ని ఏరివేయడంలో అజిత్ దోవల్ కీలక పాత్ర పోషించారు. ఆపరేషన్ బ్లాక్ థండర్ పేరుతో జరిగిన ఏరివేత కార్యక్రమంలో ఆయన పాత్ర కీలకం. ఐఎస్ఐ ఏజెంట్ గా నటిస్తూ ఆయన స్వర్ణ దేవాలయంలోకి చొరబడ్డారు. వేర్పాటువాదులతో కలసినట్టు నటించి.. వారిని తప్పుదారి పట్టించి చివరకు భారత సైనికుల చేతికి వారు చిక్కేలా వ్యూహ రచన చేసి విజయవంతం అయ్యారు. ఆపరేషన్ బ్లాక్ థండర్ తర్వాత ఆయనకు కీర్తి చక్ర పురస్కారం లభించింది.

దోవల్ అడుగు పెడితే విజయమే..

1999లో జరిగిన విమాన హైజాకింగ్ విషయంలో కూడా అజిత్ దోవల్ దౌత్య నైపుణ్యాలతో ప్రయాణికుల్ని కాపాడారు. కాందహార్ హైజాకింగ్ లో ప్రాణ నష్టం జరగకుండా నివారించారు. 2014లో ఇరాక్ లోని తిక్రిత్ లో చిక్కుకున్న 46 మంది భారతీయ నర్సులను తరలించడంలో దోవల్ చురుకైన పాత్ర పోషించారు. మయన్మార్ లో ఉగ్రదాడులు, మణిపూర్ దాడుల విషయంలో కూడా ఆయన వ్యూహాలు విజయవంతం అయ్యాయి. 2016లో ఉరి దాడి తర్వాత జరిగిన సర్జికల్ స్ట్రైక్స్ ని పర్యవేక్షించింది కూడా అజిత్ దోవలే. భారతదేశ ఉగ్రవాద నిరోధక వ్యూహాన్ని సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా ఆయన పునర్నిర్వచించారు. 2019 బాలాకోట్ వైమానిక దాడి సందర్భంలో అభినందన్ వర్ధమాన్ అనే ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ పాకిస్తాన్ లో చిక్కుకునిపోగా.. దౌత్యపరమైన ఒత్తిడి తీసుకొచ్చి అతడిని విడిపించారు అజిత్ దోవల్. ఆయన సుదీర్ఘ కెరీర్ లో చాలా విజయాలను అందుకున్నారు. కొన్నిసార్లు కీలక ఆపరేషన్లు చేపట్టి శత్రుమూకను అంతమొందించేవారు. అవసరం లేదనుకుంటే, దౌత్యపరమైన చాకచక్యంతో భారత్ కు మేలు చేసేవారు. తాజాగా మరోసారి అజిత్ దోవల్ సేవల్ని భారత్ సమర్థంగా వినియోగించుకోవాలనుకుంటోంది. దాదాపు రెండున్నర గంటల సేపు అజిత్ దోవల్ సహా రక్షణ మంత్రితో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఉగ్రమూకల్ని ఎలా మట్టుబెట్టాలి, కాశ్మీర్ లో తిరిగి శాంతిభద్రతలను ఎలా నెలకొల్పాలనే విషయంపై వారు చర్చించినట్టు తెలుస్తోంది. మరి అజిత్ వ్యూహం ఏంటి..? దాన్ని ఎప్పుడు, ఎలా అమలు చేస్తారు..?

# అకాల వర్షాలతో రైతులపై దెబ్బ

హైదరాబాద్,ఇటీవలి అకాల వర్షాలు, వడగళ్లు బీభత్సం సృష్టించాయి. ఈవర్షాలు మరోసారి రైతులను నట్టేట ముంచాయి. చేతికొచ్చిన పంటను నేలపాలు చేశాయి. వడగండ్లు, ఈదురుగాలులతో కురిసిన వానలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కోతకొచ్చిన మక్క, వరి చేన్లు నేలకొరిగి పోగా.. కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసుకున్న వడ్లు తడిసిపోయాయి. వాన నీటిలో కొట్టుకు పోయాయి. పక్వానికొచ్చిన మామిడి కాయలన్నీ రాలిపోయాయి. చేతికొచ్చిన పంట నీటిపాలు కావడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ, సూర్యపేట్ జిల్లాలో రైతులు భారీగా నష్టపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట అకాల వర్షాలకు ఆగమవుతుండడంతో లబోదిబోమని మొత్తుకుంటున్నారు రైతులు. ఇకపోతే పలుచోట్ల సకాలంలో నీరు అందక పంటలు ఎండిపోయాయి. ఈ సంవత్సరం అకాల వర్షాలకు తోడు నీటి సమస్య కూడా తోడయ్యింది. అకాల వర్షాలతో పంటలు దెబ్బతినడంతో అధికారులు, నేతు జిల్లాల్లో స్వయంగా పరిశీలించారు. త్వరలోనే పంట నష్టాలన్ని లెక్కకట్టి పరిహారం అందచేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పారు. అకాల వర్షాలతో ఎన్నడూ లేని విదంగా పూర్తి పంట నష్టపోయిన ప్రాంతాల్లో బిఆర్ఎస్ నేతలు ఆయా ప్రాంతాల్లో క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిశీలించారు. రైతులలో భరోసా నింపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. పలు జిల్లాల్లో వాణిజ్య పంటలు నేలకొరిగాయి.

# సన్న ధాన్యానికి డిమాండ్

నిజామాబాద్,ఈసారి దేశీయంగా ధాన్యానికి మంచి డిమాండ్ ఉందని భావిస్తున్నారు. దీనికితోడు జిల్లాలో సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ప్రధానంగా సన్న ధాన్యానికి డిమాండ్ ఏటేటా పెరుగుతోంది. దీనికోసం వ్యాపారులుకూడా కొనుగోలుకు సిద్దంగా ఉన్నారు. మరోవైపు ధాన్యం సేకరణకు ఇప్పటినుంచే పక్కాగా కార్యాచరణ చేస్తున్నారు. గత యేడాదితో పోలిస్తే జిల్లాలో ఈసారి పెద్దఎత్తున దిగుబడులు వస్తాయన్నారు. సాధారణ సాగుకు మించి వరిసాగును రైతులు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే ఆయా శాఖల అధికారులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు స్పష్టమైన ఆదేశాలు వెళ్ళాయి. రైతులు నష్టపోకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తిస్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గతంలోనే సిఎం రేవంత్ ఆదేశాలు ఇచ్చారు. ఇటీవల మంత్రి ఉత్తమ్ కూడా కలెక్టర్లు ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు జిల్లాలో ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు వరికోతలు మొదలుపెట్టడంతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేం దుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో సన్న రకం, దొడ్డురకం ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయనున్నారు. సాగుచేసిన సన్న రకం ధాన్యాన్ని రైతులు ఎక్కువగా ప్రైవేట్‌కే అమ్ముకు నేందుకు మొగ్గు చూపుతుండగా దొడ్డురకం ధాన్యాన్ని మాత్రం కొనుగోలు కేంద్రాల్లో కొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. బోధన్ డివిజన్‌తో పాటు ఆర్మూర్ డివిజన్‌లోని కొన్ని మండలాల్లో సన్నరకాలను రైతులు బయటనే అమ్మే అవకాశం ఉంది. ధాన్యం తరలింపుకోసం జిల్లా వ్యాప్తంగా వాహనాలను అందుబాటులో ఉంచేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి కూడా ధాన్యం దిగుబడులు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. మరోవైపు జిల్లాలో పసుపుకు డిమాండ్ పెరిగింది. ధరలు కూడా పెరగడంతో పసుపు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# వైసీపీ పేజ్ లో ఎన్నో కామెంట్స్!

విజయవాడ:ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంపై తీవ్ర చర్చ జరుగుతోంది. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు పాల్పడినట్లు ఫిర్యాదులు రావడంతో పార్టీ క్రమశిక్షణ కమిటీ సిఫార్సుల మేరకు పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైసీపీ కేంద్రం కార్యాలయం ఓ ప్రకటన జారీ చేసింది. అయితే దువ్వాడ పార్టీ క్రమశిక్షణ అతిక్రమించారో లేదో కానీ, వ్యక్తిగత క్రమశిక్షణ తప్పడం, పార్టీ పరువును బజారున పడేయడం వల్లే సస్పెండ్ చేసినట్లు పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ నిర్ణయాన్ని ఎప్పుడో తీసుకోవాలని, పార్టీకి పూర్తిస్థాయి డ్యామేజ్ జరిగిన తర్వాత ఇప్పుడు సస్పెండ్ చేయడం వల్ల ప్రయోజనమేంటన్న ప్రశ్న కూడా తలెత్తుతోంది. ముఖ్యంగా పార్టీ నిర్ణయంపై సొంత కార్యకర్తలతోపాటు సోషల్ మీడియా యాక్టవిస్టులు విమర్శలు గుప్పిస్తున్నారు. రకరకాల కామెంట్స్ తో వైసీపీ పేజీలు నిండిపోతున్నాయి. దువ్వాడతోపాటు మరికొందరిని కూడా సాగనంపితే బాగుంటదనే సూచనలు వస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ సస్పెన్షన్ వైసీపీలో తీవ్ర దుమారం రేపుతోంది. గత కొంతకాలంగా వ్యక్తిగత అంశాలతో ఆయన అన్ని హద్దులు అతిక్రమించి పార్టీ పరువును బజారు కీడ్చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కుటంబం, భార్యతో తగాదా మొదలైన నాడే పార్టీ స్పందిస్తే బాగుండేదని అంటున్నారు. మరీ ముఖ్యంగా నాలుగు గోడల మధ్య చర్చించాల్సిన అంశాలు, విషయాలను ఆయన పబ్లిక్ గా చాటుకోవడం.. మీడియాలో మరీ ముఖ్యంగా తన అనైతిక వ్యవహారాలను సోషల్ మీడియా వేదికగా సమర్థించుకోవడం, దానికి వంత పాడినట్లు ఇన్నాళ్లు పార్టీ స్పందించకపోవడంతో చాలా డ్యామేజ్ జరిగిందని అంటున్నారు. దీనిపై రకరకాల కామెంట్స్ తో పార్టీ నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. నిజానికి దువ్వాడను ఎప్పుడో సాగనంపాలని, నువ్వు ఎక్కాల్సిన ట్రైన్ జీవిత కాలం లేటు అన్నట్లు పార్టీ అన్ని విధాలుగా నష్టపోయిన తర్వాత సస్పెన్షన్ వేటు వేయడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దువ్వాడతో పాటు పనిలో పనిగా మరికొందరిపై వేటు వేయాలని సోషల్ మీడియా పేజీల్లో కార్యకర్తలు డిమాండ్ కేస్తున్నారు. పార్టీ నుంచి సాగనంపాల్సిన వారిలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ అనంతబాబు తోపాటు మరికొందరి పేర్లు సూచిస్తున్నారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి డోర్ డెలవరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును సస్పెండ్ చేయాలని ఎక్కువ మంది పోస్టింగులు చేస్తున్నారు. అదేవిధంగా దువ్వాడను సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ప్రకటనపై అధ్యక్షుడు జగన్ సంతకం లేకపోవడాన్ని కొందరు ప్రస్తావిస్తున్నారు. గౌరవ డాక్టరేట్ పొందిన గౌరవప్రదమైన వ్యక్తిని పార్టీ నుంచి బహిష్కరిస్తారా? ఇది చాలా పెద్ద తప్పు అంటూ ఓ వీరాభిమాని సెటైర్ వేశారు. ఇక అంతిమంగా మంచి నిర్ణయం తీసుకున్నారని కొందరు అభినందిస్తుండగా, ఎక్కువ మంది మాత్రం పార్టీ నిర్ణయం తీసుకోవడంలో చాలా జాప్యం జరిగిందనే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మర్డర్ చేసి డోర్ డెలివరీ చేసినోడిని కూడా ఇలాగే సస్పెండ్ చేసాం అని చెప్పారు. నెక్ట్స్ మీ ప్రతీ మీటింగ్స్ లో ఉన్నాడు. చివరికి జగన్ పక్కనే ఒకే వేదిక మీద కూర్చున్నాడు. మీ పార్టీ సస్పెనస్ అంతే... అంటూ ఓ సోషల్ యాక్టవిస్టు పోస్టు చేశాడు. ఇప్పటికీ జ్ఞానోదయం ఐయ్యింది ఇలాంటి స్క్రాప్ పార్టీ లో చాలా మంది ఉన్నారు. అందరినీ వేరి పారేయాలి అంటూ మరో కార్యకర్త సూచించాడు. ఇలాంటి పనులు ఎలక్షన్ బిఫోర్ చేసి ఉంటే కనీసం ప్రతిపక్ష హెూదా అయినా వచ్చి ఉండేది అంటూ మరో కార్యకర్త అభిప్రాయపడ్డాడు.

# పాకిస్తాన్ ఎడారిగా మారడం ఖాయం.. "సింధు జలాల ఒప్పందం రద్దు"..




న్యూఢిల్లీ, దాయాది దేశం పాకిస్తాన్ భారత్‌పైకి ఉగ్రవాదాన్ని ఉసిగొల్పుతూనే ఉంది. మంగళవారం జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామ్‌లో సాధారణ టూరిస్టులను టార్గెట్ చేసుకుని ముష్కరులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 28 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు తామే పాల్పడినట్లుగా పాక్ ప్రేరేపిత లష్కరే తోయిబా ప్రాక్సీ సంస్థ "ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)" ఉగ్రసంస్థ ప్రకటించింది. ఈ దాడికి సంబంధించి పాకిస్తాన్ ప్రమేయాన్ని భారత ఇంటెలిజెన్స్ సంస్థలు కనుగొన్నాయి. ఈ మేరకు పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత్ తన చర్యల్ని మొదలుపెట్టింది. పాకిస్తాన్ జీవనాడి అయిన సింధు నదికి సంబంధించి "సింధు జలాల ఒప్పందం"ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించింది. ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన ఆయన నివాసంలో జరిగిన " కాబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ(సీసీఎస్)" సమావేశం తర్వాత ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. పాక్‌తో దౌత్య సంబంధాలను రద్దు చేసుకుంది. వాఘా -అట్టారీ బోర్డర్‌ని పూర్తిగా మూసేస్తున్నట్లు ప్రకటించింది. పాక్ పౌరులకు వీసాలు రద్దు చేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని పోషిస్తున్న పాకిస్తాన్‌కి గతంలో చాలా సార్లు భారత్ అవకాశం ఇచ్చింది. సాధారణ ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దని సింధు నది జలాల జోలికి వెళ్లలేదు. అయితే, గతంలో ఒకసారి ప్రధాని మోడీ మాట్లాడుతూ.. రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు అంటూ ఈ ఒప్పందం గురించి మాట్లాడారు. తాజాగా, పహల్గామ్ ఘటన తర్వాత పాకిస్తాన్‌కి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. ఈ చర్య వల్ల పాకిస్తాన్ ఎడారిగా మారడం ఖాయం. సింధు నది జలాలపైనే పంజాబ్, సింధ్ వంటి రాష్ట్రాలు ఆధారపడి ఉన్నాయి.

ఏమిటీ ఒప్పందం..?

సింధూ నదీ జలాలపై 1960లో అప్పటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, పాక్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్‌లు వరల్డ్ బ్యాంక్ మధ్యవర్తిత్వంలో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం.. భారత్‌కి తూర్పు నదులు బియాస్, రావి, సట్లేజ్‌లపై, పాకిస్తాన్‌కి పడమర నదులైన సింధు, చీనాబ్, జీలం నదులపై నియంత్రణ ఉంటుంది. ఈ ఒప్పందం వల్ల 80 శాతం నీటిని పాక్ వినియోగించుకుంటోంది. పలు సందర్భాల్లో ఈ ఒప్పందం వివాదాస్పదమైంది. ఈ ఒప్పందం వల్ల భారత్ కన్నా పాకిస్తాన్ ఎక్కువ లబ్ధి పొందిందనే వాదన కూడా ఉంది. 2016 ఉరీ ఉగ్రదాడి తర్వాత భారత ప్రధాని నరేంద్రమోడీ.. "రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు" అని వ్యాఖ్యానించారు. 2023లో ఈ ఒడంబడికపై మళ్లీ చర్చించాల్సిందిగా భారత్ అధికారికంగా పాకిస్తాన్‌కి తెలియజేసింది. అయితే, పాక్ మాత్రం పాత ఇండస్ వాటర్ ట్రిటీ నిర్దేశించిన విధానాలకు కట్టుబడి ఉండాలనే కోరికను వ్యక్తం చేసింది.

ఇదే జరిగితే పాక్ ఎడారి:

ప్రపంచంలో అతి తక్కువ నీటి వనరులు ఉన్న దేశాల్లో పాకిస్తాన్ ఒకటి. ఈ దేశానికి సింధు నదీ జలాలే ప్రధాన వనరు. వ్యవసాయంపై ఆధారపడిన ఈ దేశంలో ఈ నదీ జలాలు అత్యంత కీలకం. అయితే, ఈ నదీ జలాలను కేవలం పంజాబ్ మాత్రమే సమర్థంగా వినియోగించుకుంటోంది. బలూచిస్తాన్, ఖైబర్ ఫఖ్తుంఖ్వా, సింధ్ ప్రాంతాలు అతి తక్కువ నీటి వనరులు కలిగిన ప్రాంతాలుగా ఉన్నాయి. ఒక వేళ భారత్ నుంచి వెళ్లే ఈ నదీ జలాల విషయంలో మన ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంటే, పాకిస్తాన్ ఏడారిగా మారడం ఖాయం. పలు సందర్భాల్లో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు భారత్‌పై దాడులు చేసినా, భారత్‌పై యుద్ధానికి తెగబడిని కూడా మన దేశం ఎప్పుడూ ఈ నది జలాల విషయాన్ని ప్రస్తావించలేదు. కానీ, ప్రస్తుతం మోడీ సర్కార్ ఉగ్రవాదంపై పాక్ తీరను ఉపేక్షించలేమని ఒప్పందాన్ని రద్దు చేసింది.

# నీటిబొట్టుతో సరికొత్తగా హైడ్రా లోగో




హైదరాబాద్, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కొత్త లోగోను విడుదల చేసింది. ఇప్పటి వరకు ఈవీడీఎం లోగోనే హైడ్రా వినియోగిస్తూ వచ్చింది. అయితే ఇప్పుడు కొత్తగా జలవనరుల శాఖను పోలి ఉండేలా లోగోను రూపొందించింది హైడ్రా. హెచ్ అక్షరంపై నీటి బొట్టుతో హైడ్రా లోగోను రూపకల్పన చేశారు. ఇకపై కొత్త లోగోతోనూ హైడ్రా కార్యకలాపాలు కొనసాగనున్నాయి. హైడ్రా కార్యాలయం, వాహనాలు, సిబ్బంది యూనిఫాంపై కూడా కొత్త లోగో కనిపించనుంది. అలాగే హైడ్రా అధికారిక ట్విట్టర్ (ఎక్స్) అకౌంట్‌కు కొత్త లోగోను ప్రొఫైల్ పిక్చర్‌గా పెట్టారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ అక్రమార్కుల్లో గుండెల్లో గుబులు పుట్టిస్తోంది హైడ్రా. ప్రజలను విపత్తుల నుంచి రక్షించడమే కాకుండా.. వారి ఆస్తులను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తెరపైకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. హైడ్రా వచ్చి కొత్తలోనే తన మార్క్‌ను చూపించింది. నగరంలో ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టిన నిర్మాణాలపై హైడ్రా పంజా విసిరింది. ఇప్పటి వరకు అనేక అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చివేసింది. చెరువులు, కుంటలపై నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేసింది హైడ్రా. అలాగే అక్రమ నిర్మాణాలపై ప్రజల నుంచి వస్తున్న వినతులపై వెంటనే స్పందిస్తూ.. ముందుగా వారికి నోటీసులు ఇచ్చి.. ఆపై వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోత వెంటనే యాక్షన్‌లోకి దిగుతోంది హైడ్రా.

బతుకమ్మ కుంట పనులు షురూ

మరోవైపు నగరంలోని అంబర్‌పేట్ బతుకమ్మకుంట అభివృద్ధి పనులను హైడ్రా మొదలుపెట్టింది. బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ అభివృద్ధి పనులను ప్రారంభించారు. వచ్చే బతుకమ్మ ఉత్సవాల నాటికి బతుకమ్మ కుంటను సిద్ధం చేస్తామని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు. బతుకమ్మ కుంటలోనే ఈసారి బతుకమ్మ ఉత్సవాలు జరుగుతాయన్నారు. బతుకమ్మ కుంట కోర్టు వివాదం పరిష్కారమైందని రంగనాథ్ చెప్పుకొచ్చారు. స్థానికులతో కలిసి పూజలు చేసి బతుకమ్మ కుంట అభివృద్ధి పనులను కమిషనర్ ప్రారంభించారు. యుద్ధ ప్రాతిపదికన చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు జరగాలని అధికారులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు.

# అనిల్ కుమార్ యాదవ్ తీరు అయోమయం!



నెల్లూరు:అనీల్ కుమార్ యాదవ్.. పరిచయం అక్కర్లేని పేరు. జగన్ హయాంలో ఓళ్లూపై తెలియకుండా మాట్లాడి, తొడకొట్టి సవాళ్లు విసిరి పాపులర్ అయ్యారు. ప్రత్యర్థులపై నోరెట్టుకుని పడిపోవడమే రాజకీయం అన్నట్లుగా అప్పట్లో ఆయన వ్యవహార శైలి ఉండేది. ఆ తీరు కారణంగానే జగన్ కు దగ్గరయ్యారనీ చెబుతుంటారు. సరే అది పక్కన పెడితే వైసీపీ ఘోర పరాజయం తరువాత అనిల్ కుమార్ యాదవ్ ఎక్కడా కనిపించలేదు. వినిపించలేదు. మౌనంగా మాయమైపోయారు. వైసీపీ అధికారంలో ఉండగా కన్నూమిన్నూ గానక ఇష్టారీతిగా తెలుగుదేశం అధినేత చంద్రబాబు పైనోరెట్టుకు పడిపోయిన అనీల్ కుమార్ యాదవ్ ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు. వినిపించడం లేదు. పోలింగ్ జరిగిన తరువాత ఒక సారి మీడియా ముందుకు వచ్చి పోలీసులు, అధికారులు ఏకపక్షంగా తెలుగుదేశం కూటమికి అనుకూలంగా వ్యవహరించారని ఓ ఆరోపణ చేసి ఫలితాలకు ముందే ఓటమి అంగీకరించేశారు. ఆ తరువాత ఆయన ఇక ఎక్కడా బయటకు వచ్చిన దాఖలాలు లేవు. అయితే పార్టీ అధికారంలో ఉండగా, తాను మంత్రిపదవి వెలగబెడుతున్న సమయంలో అనీల్ కుమార్ యాదవ్ నెల్లూరు జిల్లా లో సాగించిన దోపిడీ పర్వం అంతా ఇంతా కాదు.నెల్లూరు జిల్లాలో ఖనిజాల దోపిడీ సహా అనేక అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతే కాదు జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ఆనం రామనాయారణరెడ్డి, కొటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వంటి వారు వైసీపీ తీరుతో, జగన్ విధానాలతో విభేదించి బయటకు వచ్చి తెలుగుదేశం గూటికి చేరారు. వారిని అనీల్ కుమార్ యాదవ్ అనుచితంగా దూషించి వారి రాజకీయ జీవితం ముగిసిపోయందని చెప్పారు. ఒక వేళ వారు రాజకీయాలలో రాణిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ సవాళ్లు సైతం విసిరారు. ఇప్పుడు తన రాజకీయ జీవితమే సందిగ్ధంలో పడిన నేపథ్యంలో ముఖం చూపలేక చాటేశారు. విపక్షంలో ఉన్న సమయంలోనే తెలుగుదేశం పార్టీ అనీల్ కుమార్ యాదవ్ అక్రమాలపై జ్యుడీషియల్ విచారణకు డిమాండ్ చేసింది. ఇప్పుడు అధకారంలోకి రాగానే విచారణకు ఆదేశించే అవకాశాలే ఎక్కువ ఉన్నాయి. ఇలా ఎలా చూసినా చిక్కుల సుడిగుండంలో చిక్కుకున్న అనీల్ కుమార్ యాదవ్ ఏ కలుగులో దాక్కొన్నా బయటకు లాక్కొచ్చి చట్టం ముందు నిలబెట్టడానికి తెలుగుదేశం శ్రేణులు సిద్ధంగా ఉన్నాయి. దీంతో తనను తాను కాపాడుకోవడం ఎలాగో తెలియక అనిల్ కుమార్ యాదవ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడా కనిపించలేదు. దీంతో ఆయన పార్టీ మారే అవకాశాలున్నాయంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే అధికారంలో ఉన్న సమయంలో స్థాయి మరిచి.. ఇష్టారీతిగా తెలుగుదేశం, జనసేన అధినాయకులపై అనిల్ కుమార్ చేసిన అనుచిత విమర్శలు, వ్యాఖ్యల కారణంగా ఆ రెండు పార్టీలలోనూ అవకాశం లేకపోయింది. దీంతో అనివార్యంగా ఆయన ఇటు వైసీపీకి దూరమై, అటు మరో పార్టీ అండ లేకుంటే కేసులను తట్టుకోవడం సాధ్యం కాదని భావించి గత్యంతరం లేని పరిస్థితుల్లో మళ్లీ జగన్ పంచన చేరి పబ్బం గడుపుకోవాలన్న నిర్ణయానికి వచ్చారని పరిశీలకులు అంటున్నారు. అందుకు ఉదాహరణగా నిన్న తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశానికి అనిల్ కుమార్ యాదవ్ హాజరు కావడాన్ని చూపుతున్నారు. మొత్తం మీద అజ్ఞానం నుంచి అజ్ఞాతంలోకి అక్కడ నుంచి మళ్లీ జగన్ పంచకు చేరిన అనిల్ కుమార్ ప్రస్తతం తన భవిష్యత్ ఏమిటన్న అయోమయంలో ఉన్నట్లుగా కనిపిస్తోందని అంటున్నారు.

# 'ఉర్సా'తో కూటమి పరువు పోయిందా..?



అమరావతి,ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీలో ప్రైవేటు పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బ్యాంకు ఆఫ్ బరోడా నిర్వహించిన సర్వేలో డొమెస్టిక్ పెట్టబడుల సాధనలో రాష్ట్రం టాప్ ప్లేస్ ను ఆక్రమించింది. అయితే ఈ స్పీడులో కొన్ని తప్పులు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబుకు చేసిన ఫిర్యాదుపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చ జరుగుతోంది. రూ.5,728 కోట్ల పెట్టుబడితో విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం భూములు అప్పగించాలని నిర్ణయించింది. అయితే ఊరూ పేరు లేని, ఎలాంటి విశ్వసనీయత లేని ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు భూ కేటాయింపుల వెనుక విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పాత్ర ఉందని, వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ఎంపీ చిన్ని అండ్ టీమ్ పావులు కదుపుతున్నారని స్వయంగా ఆయన సోదరుడు నాని ఫేస్ బుక్ లో పోస్టు పెట్టడం దుమారం రేపుతోంది. విజయవాడ సిట్టింగ్ ఎంపీ కేశినేని శివనాథ్ అలియాస్ చిన్ని, మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ అలియాస్ నాని స్వయాన అన్నదమ్ములు అన్న విషయం తెలిసిందే. ఈ ఇద్దరి మధ్య చాలాకాలంగా రాజకీయ పోరు కొనసాగుతోంది. అయితే రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు అత్యంత సహజమైనా, ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవాన్నే ప్రశ్నించినట్లు చిన్ని స్కాంకు పాల్పడుతున్నాడని నాని చేసిన పోస్టుపై తీవ్ర చర్చ జరుగుతోంది. పొలిటికల్ సర్కిల్స్ లో ఏ ఇద్దరు కలిసినా 'ఉర్సా'పైనే మాట్లాడుకుంటున్నారు. అదే సమయంలో సోషల్ మీడియాలో కూడా ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కోసం జల్లెడ పడుతున్నారు. తన ఫేస్ బుక్ పోస్టులో ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పై మాజీ ఎంపీ కేశినేని నాని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశిస్తూ " మీ నాయకత్వాన్ని, పార్టీ పేరును అవినీతి ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి. రాష్ట్రంలో జరుగుతున్న వ్యవహారాలు అన్నీ ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. పెట్టుబడి ముసుగులో ప్రభుత్వ భూములు దోచుకోబడకుండా మీరు నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తారని నాకు నమ్మకం ఉంది" అంటూ మాజీ ఎంపీ కేశినేని నాని పోస్టు పెట్టడం వైరల్ అవుతోంది. అదేవిధంగా "ఈ భూ కేటాయింపు నిజమైన పారిశ్రామిక అభివృద్ధి కోసం ఉద్దేశించబడలేదు, వ్యక్తిగత లాభం కోసం ప్రభుత్వ యంత్రాంగాలను ఉపయోగించి రహస్యంగా భూ కబ్జా చేయడమే అని స్పష్టంగా తెలుస్తోంది. దీన్ని అనుమతించడం వల్ల ప్రజా ప్రయోజనాలకు హాని జరగడమే కాకుండా, స్వచ్ఛమైన పారదర్శక పాలనను ఎల్లప్పుడూ కొనసాగిస్తామని చెప్పుకునే మీ పరిపాలన విశ్వసనీయత కూడా దెబ్బతింటుంది" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు హెచ్చరికతో కూడిన విజ్ఞప్తి చేసినట్లు చెబుతున్నారు. సాధారణంగా ఎంతో జాగ్రత్తగా వ్యవహరించే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉర్సా విషయంలో ఎక్కడ బోల్తా కొట్టిందనే ప్రశ్న తలెత్తుతోంది. మాజీ ఎంపీ కేశినేని నాని లేవనెత్తిన అభ్యంతరాలపై ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఎవరూ నోరు విప్పకపోవడంపైనా చర్చ జరుగుతోంది. నాని ఆరోపించినట్లు ఎంపీ చిన్ని సహచరులకు లబ్ధి చేసేలా ఇంతటి పొరపాటు చేస్తారా? ఇలా ఊరూపేరు లేని కంపెనీకి ప్రభుత్వ భూములు ఎలా ఇస్తారు? ఇది ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిసే జరిగిందా? తొందరపాటులో ఏదైనా తప్పు దొర్లిందా? అన్న చర్చ జరుగుతోంది. కేవలం రూ. 10 లక్షల ఆథరైజ్డ్ క్యాపిటల్, రూ.లక్ష పెయిడ్-అప్ క్యాపిటల్ తో మొదలైన కంపెనీ, ఏపీతోపాటు తెలంగాణలోనూ పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకోవడంపై ఆన్ లైన్ వేదికగా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎంపీ కేశినేని నాని అన్నట్లు టీసీఎస్ కు 99 పైసలు చొప్పున భూమి కేటాయించడంపై ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయడం లేదు. కానీ, 'ఉర్సా' విషయంలోనే రివర్స్ టాక్ వినిపిస్తోంది. ఈ కంపెనీ డైరెక్టర్లుగా చెబుతున్నవారిలో కౌశిక్ అమెరికాలో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిగా పనిచేస్తున్నారని చెబుతున్నారు. సతీష్ ఎలిసియం అనలిటిక్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ. వీరిద్దరే యూఎస్‌లో రిజిస్టర్ అయిన ఉర్సా క్లస్టర్స్ లిమిటెడ్ లయబిలిటీ కంపెనీ డైరెక్టర్లు. అయితే ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అడ్రస్‌గా హైదరాబాద్ కొత్తగూడలో ఒక రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌ను చూపించారని అంటున్నారు. వాస్తవానికి అక్కడ ఎటువంటి కార్యాలయాలు లేవని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఎవరైనా తప్పుదారి పట్టించారా? ఈ భూ సంతర్పణ వెనుక ఎవరున్నారు? మాజీ ఎంపీ కేశినేని నాని ఆరోపణలు నిజాలేనా? కావా? అన్న చర్చ జరుగుతోంది. ఏదిఏమైనా ఈ ఉదంతం కూటమి ప్రభుత్వానికి ఒక హెచ్చరిక లాంటిదని అంటున్నారు.

# వీరికి గుడ్ న్యూస్ త్వరలో.. నెలకు మూడు వేలు?




అమరావతి,ఆంధ్రప్రదేశ్ లోని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం త్వరలోనే నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పనుంది. నిరుద్యోగ భృతి చెల్లించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే ఎంత మంది నిరుద్యోగులున్నారు? ఎందరు డిగ్రీలు అంటే ఇంజినీరింగ్ తత్సమాన పరీక్షలను పూర్తి చేసిన వారు ఎంత మంది? అన్న దానిపై ఇప్పటికే సమాచారం సేకరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఇంటిటి ఇంటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ లెక్కలతో ఏపీలో నిరుద్యోగులు ఎంతమంది అన్న దానిపై క్లారిటీ రానుంది. అయితే నిరుద్యోగ భృతి ఇచ్చేవాళ్లకు ఇచ్చినా, అర్హత లేకుండా ఖాళీగా ఉండి పనిలేని వాళ్లకు పనులు కల్పించాలని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం యోచిస్తుంది.

మొత్తం ఇరవై ఆరు జిల్లాల్లో...

అయితే ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో జరుగుతున్న ఇంటింటి సర్వేలో పనిచేసే వయసులో పనిలేని వాళ్లు రాష్ట్రంలో కోటిన్నర మంది ఉన్నట్లు సర్వేలో వెల్లడయినట్లు తెలిసింది. సచివాలయాల ఉద్యోగులు గత నెలలో ఈ సర్వే నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లో దాదాపు 2.67 కోట్ల మంది వివరాలను ఉద్యోగులు సర్వే ద్వారా తెలుసుకున్నారు. అయితే ఈ సర్వేలో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయని తెలిసింది. ఏ పనీ లేనివారు రాష్ట్రం మొత్తం మీద 1.56 కోట్ల మంది ఉన్నారు. అనకాపల్లి జిల్లాలో 5.43 లక్షల మంది, అనంతపురం జిల్లాలో 7.24 లక్షల మంది, అన్నమయ్య జిల్లాలో 5.22 లక్షల మంది, బాపట్ల జిల్లాలో 5.82 మంది, చిత్తూరు జిల్లాలో 6.10 లక్షల మంది ఉన్నారు. కోనసీమ జిల్లాలో 6.17 లక్షల మంది, తూర్పుగోదావరి జిల్లాలో 5.36 లక్షల మంది, ఏలూరు జిల్లాలో 6.37 లక్షల మంది, గుంటూరు జిల్లాలో 5.86 లక్షల మంది, కాకినాడ జిల్లాలో 6.49 లక్షల మంది, కృష్ణా జిల్లాలో 4 .20లక్షల మంది, కర్నూలు జిల్లాలో 7.62 లక్షల మంది, నంద్యాల జిల్లాలో 5.91 లక్షల మంది, ఎన్టీఆర్ జిల్లాలో 5. 99 లక్షల మంది వరకు ఉన్నట్లు సర్వేలో వెల్లడయింది.

అతి తక్కువగా ఈ జిల్లాలో...

పల్నాడు జిల్లాలో 5.87 లక్షల మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 3.38 లక్షల మంది, ప్రకాశం జిల్లాలో 7 లక్షల మంది, నెల్లూరు జిల్లాలో 7. 48 లక్షల మంది, సత్యసాయి జిల్లాలో 6.17 లక్షల మంది, శ్రీకాకుళం జిల్లాలో 7.56 లక్షల మంది, తిరుపతి జిల్లాలో 6.46 లక్షల మంది, విశాఖ జిల్లాలో 5.56 లక్షల మంది , విజయనగరం జిల్లాలో 6.93 లక్షల మంది, పశ్చిమ గోదావరి జిల్లాలో 5. 68మంది, వైఎస్సార్ జిల్లాలో 6.28 మంది, అల్లూరి జిల్లాలో అత్యల్పంగా 4.89 లక్షల మంది ఉన్నారు. పని లేని వారిని గుర్తించిన ప్రభుత్వం వారందరికీ నచ్చిన రంగంలో నైపుణ్యాలు పెంచుకునేలా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.

నిరుద్యోగ భృతి వరకూ...

విద్యార్హతలు ఉన్న వారికి ఇళ్ల నుంచే పని చేసుకునేలా వివిధ సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాలని ప్రభుత్వం భావిస్తుంది. అయితే ఇందులో డిగ్రీ పూర్తి చేసిన వారికి నిరుద్యోగ భృతి ఇవ్వడంపై ఒక ప్రకటన చేయనుంది. ఎన్నికలకు ముందు కూటమి నుంచి చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయల భృతి ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఈ ఇంటింటి సర్వేను నిర్వహించినట్లు సమాచారం. ఈ నిరుద్యోగ భృతికి సంబంధించిన నిధులు మొన్నటి బడ్జెట్ లో పెట్టకపోయినా త్వరలోనే అమలు చేయాలన్న నిర్ణయంతో చంద్రబాబు ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. అందుకోసమే ఈ లెక్కలను సేకరించింది. అర్హత లేని వారికి మాత్రం శిక్షణ ఇచ్చిపనికల్పించనున్నారు.

## ఉగ్రదాడి పిరికిపంద చర్య...

అమరావతి,పహల్గామ్ ఉగ్రవాద దాడిని మాజీ ఎమ్మెల్యే, వైయస్ఆర్ సీపీ పీఏసీ సభ్యులు హఫీజ్ ఖాన్ తీవ్రంగా ఖండించారు. జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఈ దాడిని అమాయక పర్యాటకులపై కిరాతకమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ముష్కర మూకల పిరికిపంద చర్యగా పేర్కొంటూ, దేశ సమైక్య తను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో కూడా సహించరాదని ఆ యన చెప్పారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేపట్టిన ఈ దాడిని దేశ శాంతి భద్రతలను భంగపరిచే చర్యగా ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ దాడికి మతాలు, రాజకీయాలు, లేదా ఏ ఇతర భేదాలను పైకి తీ సుకోకుండా, దేశవ్యాప్తంగా అందరు ఐక్యంగా పోరాడాలని హఫీజ్ ఖాన్ గారు అన్నారు.

# గుంటూరు.. మంటెత్తుతున్న పాలిటిక్స్ ..!



గుంటూరు: గుంటూరు రాజకీయాలు ఘాటెక్కాయి. ఒకరకంగా చెప్పాలంటే.. గుంటూరు మిర్చిని తలపిస్తున్నాయి. ఎం డాకాలం.. అందునా పోటెత్తుతున్న ఎండలకు తోడు ఈరాజకీయాల వేడి.. గుంటూరు జిల్లాను కుదిపేస్తోం ది. ఒకరంటే ఒకరికి పడడం లేదు. ఒకరంటే.. ఒకరు ఆమడ దూరం. ఇదీ.. గుంటూరు రాజకీయాల పరిస్థి తి. గుంటూరు పరిధిలో మంగళగిరిని పక్కన పెడితే.. తెనాలి, గుంటూరు వెస్ట్, ఈస్ట్ సహా.. ఇతర నియోజక వర్గాల్లో టీడీపీ, జనసేనలు విజయం దక్కించుకున్నాయి. అయితే.. కలసి ఉంటే కలదు సుఖం అన్న సూత్రాన్ని పక్కన పెట్టిన నాయకులు.. ఎంత దూరంగా ఉంటే అంత మంచిది అన్నట్టుగా వ్యవహరిస్తున్నారట. ముఖ్యంగా కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌పై మెజారిటీ ఎమ్మెల్యేలు గుస్సాగా ఉన్నారు. పోనీ.. వారైనా కలిసి ఉన్నారా? అంటే.. లేదు. ఎక్కడ కలుసుకుంటే.. వారి వారి లోపాలు బయటకు వస్తాయోనని.. నాయకులు భావిస్తున్నారు. గుంటూరు ఈస్ట్, వెస్టలలో కొత్త నాయకులు విజయం దక్కించుకున్నారు. ఇక, తెనాలిలో జనసేన గెలుపు గుర్రం ఎక్కింది. ఒకరకంగా అందరూ కూటమి పార్టీ నాయకులే. కానీ, ఒకరి తో ఒకరు మాట్లాడరు. ఒకరి వ్యవహారాల్లో ఒకరు తలదూర్చరు. అయితే.. ఇది మంచిదే కదా? అనే చర్చ ఉంది. కానీ, అసలు విషయం ఎవరు ఎవరినియోజకవర్గంలో వేలు పెడితే.. వారి వారి లోపాలు బయటకు వస్తున్నాయన్న బెంగ ఉంది. దీంతో కొన్ని రోజులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నా.. తర్వాత.. సర్దుకు పోయారు. కానీ, ప్రజలను గుర్తించే విషయంలో మాత్రం.. ఎవరికి వారే అన్నట్టుగా దూరంగా ఉంటున్నారు. తెనాలిలో నే ఉంటున్నా.. మంత్రిని కలుసుకునేందుకు ప్రజలకు అవకాశం ఉండదు. ఇక, గుంటూరు వెస్ట్‌లో గల్లా మాధవి.. తాను చెప్పిందే వినాలనే టైపు. అంతేకాదు.. నియోజకవర్గంలో పర్యటిస్తున్నారన్న పేరే కానీ.. సమస్యలు పరిష్కరించలేక పోతున్నారట. అదేసమయంలో వెస్ట్ లో ఇప్పటికీ తాగునీటి సమస్య ఉంది. కానీ, ఇక్కడ ఎమ్మెల్యే వారికి ఆ సమస్య పరిష్కరించేందుకు సమయం చిక్కడం లేదట. మొత్తంగా చూస్తే.. గుంటూరు రాజకీయాలు.. ఘాటుగా సాగుతున్నాయి.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com